ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# మన ప్రజాప్రతినిధి

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

తెలుగు దినపత్రిక

| సంపటి : 3 | సంచిక :319 | హైదరాబాద్ | శనివారం | సెప్టెంబర్ 12 2026 | పేజీలు : 4 వేల : 2/ |
|---|---|---|---|---|---|

Published From:Telangana & Andrapradesh,Hyderabad & Vijayawada.Editar:G.Srinivas,epaper.manaprajaprathinidhi.com,

# ఏఐతో ఉగ్రవాదానికి కొత్త రూపం

- దాడుల నుంచి భావజాల యుద్ధానికి మార్పు
- మహిళలు, చిన్నారులపై ప్రత్యేక గురి
- ఏఐతో వేగంగా విస్తరిస్తున్న ప్రచారం
- భద్రతా వ్యవస్థలకు కొత్త సవాళ్లు

11 సెప్టెంబర్ (మనప్రజాప్రతినిధి) ఐసిస్, అల్-ఖైదా వంటి అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలు తమ కార్యకలాపాల పద్ధతిని పూర్తిగా మార్చుకున్నాయని ఐక్యరాజ్యసమితి తాజా నివేదిక వెల్లడించింది. గతంలో భౌతిక దాడులు, బాంబు పేలుళ్లు, ఆత్మాహుతి దాడుల ద్వారా భయాందోళనలు సృష్టించిన ఈ సంస్థలు ఇప్పుడు భావజాల వ్యాప్తి, రాడికలైజేషన్‌ను ప్రధాన ఆయుధంగా మలుచుకున్నాయని పేర్కొంది. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను వినియోగిస్తూ



2

## స్థానిక ఎన్నికలపై కాంగ్రెస్ ఫోకస్

- షర్మిల ఆదేశాలతో మానిటరింగ్ కమిటీ ఏర్పాటు
- రఘువీరారెడ్డికి చైర్మన్ బాధ్యతలు
- కాంగ్రెస్ విజయమే లక్ష్యమన్న షర్మిల
- సీనియర్ నేతలకు కీలక బాధ్యతలు



2

## సీఐఎస్ఎఫ్ సిబ్బందికి పదోన్నతులు

- ఢిల్లీ మెట్రో యూనిట్‌లో ప్రమోషన్ వేడుక
- 48 మంది కానిస్టేబుళ్లకు పదోన్నతి
- కార్యక్రమానికి హాజరైన సంతోష్ చాల్కే
- బాధ్యతలు మరింత పెరిగాయని అధికారుల వ్యాఖ్య




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11 (మనప్రజాప్రతినిధి) సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్సీ) యూనిట్‌లో ప్రమోషన్ అండ్ పిప్పింగ్ సెరిమనీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 48 మంది కానిస్టేబుల్/జీడీ సిబ్బందికి హెడ్ కానిస్టేబుల్/జీడీ హోదాలకు పదోన్నతులు కల్పించారు. వారి అంకితభావం, కృషి, విధి నిర్వహణలో చూపిన ప్రతిభకు గుర్తింపుగా ఈ పదోన్నతులు లభించాయి. పదోన్నతి పొందిన సిబ్బంది కొత్త

2

## పేదల గృహ కలను సాకారం చేసిన కాంగ్రెస్

- రాష్ట్రంలో రెండు లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం
- నిజామాబాద్‌లో పైలెట్ ప్రాజెక్టుగా ఇందిరమ్మ టవర్స్
- కేంద్ర బకాయిలను విడుదల చేయాలి మహేష్ కుమార్ గౌడ్




హైదరాబాద్, సెప్టెంబర్ 11 (మనప్రజాప్రతినిధి) దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా పేదల సొంతింటి కలను సాకారం చేసే గొప్ప కార్యక్రమంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం నిలిచిందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. శాసనమండలిలో జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎప్పటినుంచో పేదల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ గృహ నిర్మాణ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనాన్ని అందించడంలో ఇందిరమ్మ ఇళ్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు.రాష్ట్రంలో ఇప్పటికే రెండు లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం చేపట్టడం శుభపరిణామమని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. సొంత ఇల్లు లేని కుటుంబాలకు భద్రత, స్థిరత్వం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. పేదల అవసరాలను గుర్తించి గృహ నిర్మాణ కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు.నిజామాబాద్‌లో పైలెట్ ప్రాజెక్టు కింద ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపట్టడం ప్రత్యేక ముందడుగుగా ఆయన అభివర్ణించారు. పట్టణ ప్రాంతాల్లో స్థలాభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఆధునిక సదుపాయాలతో కూడిన గృహ సముదాయాల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. ఈ తరహా ప్రాజెక్టులు భవిష్యత్తులో

2

## రైతు సమస్యల పరిష్కారంలో తుమ్మలకు ప్రశంసలు

- తుమ్మల పనితీరును కొనియాడిన రాకేష్ రెడ్డి
- రైతుల ఆందోళనపై వెంటనే స్పందించిన మంత్రి
- 15 నిమిషాల్లో ఫోన్ చేసి భరోసా ఇచ్చిన తుమ్మల
- పార్టీలకు అతీతంగా సేవలందిస్తున్న మంత్రి
- బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (మనప్రజాప్రతినిధి) రైతుల సమస్యల పరిష్కారంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చూపిన చొరవను అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ప్రశంసించారు. రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా ప్రజా సమస్యలపై స్పందిస్తున్న తుమ్మల పనితీరు అభినందనీయమని పేర్కొన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి మంత్రి తీసుకున్న చర్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు.తన నియోజకవర్గంలో సుమారు 500 మంది రైతులు ఇంటి ముందు బైఠాయించి ధర్నాకు దిగిన సందర్భాన్ని రాకేష్ రెడ్డి వివరించారు. సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఆదివారం రోజున మంత్రి కార్యాలయ అధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న కొద్దిసేపటికే మంత్రి స్వయంగా స్పందించారని చెప్పారు.ఓఎస్డీకి ఫోన్ చేసిన 15 నిమిషాల్లోనే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనకు ఫోన్ చేశారని రాకేష్ రెడ్డి వెల్లడించారు. రైతుల సమస్యను పూర్తిగా విన్న అనంతరం మూడు గంటల్లో సమస్య పరిష్కారమవుతుందని మంత్రి భరోసా ఇచ్చారని తెలిపారు. చెప్పినట్లుగానే తిరిగి ఫోన్ చేసి అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు తెలియజేశారని పేర్కొన్నారు. తరువాత రోజు జిల్లా కలెక్టర్‌ను సంప్రదించగా మంత్రి స్వయంగా మాట్లాడి సమస్య పరిష్కారానికి ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసిందని ఎమ్మెల్యే తెలిపారు. రైతుల సమస్యలపై మంత్రి చూపిన చిత్తశుద్ధి, వేగవంతమైన స్పందన తనను ఆకట్టుకుందని అన్నారు. ప్రజాప్రతినిధులందరికీ ఇది ఆదర్శంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.నలభై ఏళ్ల రాజకీయ అనుభవం కలిగిన తుమ్మల నాగేశ్వరరావు ప్రతిపక్షానికి చెందిన ఎమ్మెల్యేల సమస్యలపైనా అదే స్థాయిలో స్పందించడం గొప్ప విషయమని రాకేష్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజా సమస్యల విషయంలో రాజకీయ భేదాలను పక్కనబెట్టి పనిచేయడం ప్రజాస్వామ్యానికి మంచిదని అన్నారు. రైతుల ప్రయోజనాల కోసం మంత్రి తీసుకున్న చర్యలను ప్రత్యేకంగా అభినందించారు. అసెంబ్లీలో జరిగిన

## ప్రజా సంతృప్తే లక్ష్యమన్న చంద్రబాబు

- కలెక్టర్లకు కీలక దిశానిర్దేశం చేసిన చంద్రబాబు
- పాలనలో ఏఐ, డీప్ టెక్నాలజీ వినియోగంపై ఫోకస్
- ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి
- సానుకూల దృక్పథం పెంచాలని అధికారులకు సూచన



2

## కల్వకుర్తి నీటి విడుదలపై బీఆర్ఎస్ డిమాండ్

- కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించిన నేతలు
- అన్ని పంపులను వెంటనే ఆన్
- రైతులతో కలిసి పంప్‌హౌస్, రిజర్వాయర్ సందర్శన
- రైతుల ప్రయోజనాల కోసం చర్యలు తీసుకోవాలి: నిరంజన్ రెడ్డి



నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 11 (మనప్రజాప్రతినిధి) మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం స్టేజ్-3 పంప్‌హౌస్, గుడిపల్లి రిజర్వాయర్‌ను మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, వి. శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్ రెడ్డి, బీరం హర్షవర్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు కురువ విజయ్ కుమార్‌తో పాటు పార్టీ నాయకులు, రైతులు కలిసి సందర్శించారు. ప్రాజెక్టు పరిధిలోని నీటి పరిస్థితులు, సాగునీటి సరఫరాపై వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ

2

మన ప్రజాప్రతినిధి

శనివారం12 సెప్టెంబర్ 2026

# ఏఐతో ఉగ్రవాదానికి కొత్త రూపం

మెదటి పేజీ తరువాయి



ప్రపంచవ్యాప్తంగా తమ ప్రభావాన్ని విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నాయని నివేదిక హెచ్చరించింది. ఈ మారుతున్న వ్యూహాలు ప్రపంచ భద్రతా వ్యవస్థలకు కొత్త సవాళ్లను విసురుతున్నాయని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ఐక్యరాజ్యసమితికి చెందిన కౌంటర్–టెర్రరిజం కమిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరేట్ (సీటీఈడీ) విడుదల చేసిన నివేదిక ప్రకారం, ఉగ్రవాద సంస్థలు జెనరేటివ్ ఏఐ సహాయంతో ప్రచార కంటెంట్‌ను వేగంగా తయారు చేస్తున్నాయి. పురుషులు, మహిళలు, యువత, చిన్నారులు వంటి వర్గాల మానసిక స్థితిని అంచనా వేసి వారికి అనుగుణంగా ప్రత్యేక సందేశాలను రూపొందిస్తున్నాయి. సోషల్ మీడియా, డిజిటల్ వేదికలు, మెసేజింగ్ యాప్‌ల ద్వారా ఈ ప్రచారాన్ని మరింత వేగంగా విస్తరిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా తమ భావజాలాన్ని వ్యాప్తి చేసి ఇస్లామిక్ రాజ్య స్థాపన లక్ష్యాన్ని సాధించడమే ఈ ప్రయత్నాల వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని నివేదిక స్పష్టం చేసింది. మహిళలు, యువతులు, చిన్నారులే ప్రస్తుతం ఈ ప్రచారానికి ప్రధాన లక్ష్యంగా మారడం ఆందోళన కలిగించే అంశంగా మారింది. మహిళలకు రక్షణ, సామాజిక గుర్తింపు, గౌరవం వంటి అంశాలను ప్రస్తావిస్తూ వారిని ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నట్లు నివేదిక పేర్కొంది. మరోవైపు యువకులను హింస, పోరాటం ద్వారానే శక్తి, గౌరవం, గుర్తింపు లభిస్తాయనే భావజాలంతో ప్రభావితం చేస్తున్నట్లు వెల్లడించింది. చిన్నారుల విషయంలో వారి అమాయకత్వాన్ని, మానసిక బలహీనతలను ఆసరాగా చేసుకుని చిన్న వయసులోనే తీవ్రవాద భావజాలాన్ని నాటే ప్రయత్నాలు జరుగుతున్నాయని హెచ్చరించింది. భారత ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారులు కూడా ఈ పరిణామాలను ధ్రువీకరించినట్లు సమాచారం. భారత్‌లో ఐసిస్, అల్–ఖైదా వంటి సంస్థలు ఏఐ ఆధారిత ప్రచారాన్ని వినియోగిస్తూ మహిళలు, చిన్నారులను లక్ష్యంగా చేసుకున్నాయని అధికారులు వెల్లడించారు. డిజిటల్ వేదికల ద్వారా వ్యక్తిగత స్థాయిలో చేరువ కావడం, వారి ఆసక్తులకు అనుగుణంగా కంటెంట్ పంపించడం, భావోద్వేగాలను ప్రభావితం చేయడం వంటి వ్యూహాలను అనుసరిస్తున్నట్లు గుర్తించారు. ఈ విధంగా రాడికలైజేషన్‌కు గురైన వ్యక్తులను సంప్రదాయ నిఘా వ్యవస్థల ద్వారా గుర్తించడం మరింత క్లిష్టంగా మారుతోందని అధికారులు పేర్కొంటున్నారు. దక్షిణ భారతదేశంలో ఈ ఏఐ ఆధారిత ప్రచార నమూనాను ఉగ్రవాద సంస్థలు మరింత సమర్థంగా వినియోగిస్తున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. భావజాల ప్రభావానికి లోనైన వ్యక్తులు నేరుగా హింసాత్మక చర్యలకు పాల్పడకుండా సాధారణ జీవితాన్ని కొనసాగిస్తుండటంతో వారిని గుర్తించడం కష్టసాధ్యంగా మారుతోంది. ఆన్‌లైన్ వేదికల ద్వారా నిశ్శబ్దంగా ప్రచారం నిర్వహించడం, కొత్త వ్యక్తులను ప్రభావితం చేయడం వంటి చర్యలు భద్రతా సంస్థలకు పెద్ద సవాలుగా మారాయి. దీంతో సైబర్ నిఘా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. భవిష్యత్తులో లష్కరే తోయిబా, జైషే మహమ్మద్ వంటి ఇతర ఉగ్రవాద సంస్థలు కూడా ఇదే తరహా వ్యూహాలను అనుసరించే ప్రమాదం ఉందని భద్రతా నిపుణులు హెచ్చరిస్తున్నారు. కృత్రిమ మేధస్సు మానవ అభివృద్ధికి ఉపయోగపడే శక్తివంతమైన సాధనమైనప్పటికీ, దాని దుర్వినియోగం ప్రపంచ భద్రతకు తీవ్రమైన ముప్పుగా మారే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ఉగ్రవాద భావజాల వ్యాప్తిని అడ్డుకునేందుకు ప్రభుత్వాలు, సాంకేతిక సంస్థలు, విద్యా వ్యవస్థలు, కుటుంబాలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. డిజిటల్ యుగంలో ఉగ్రవాదం కొత్త రూపాలు సంతరించుకుంటున్న నేపథ్యంలో అప్రమత్తత, అవగాహన, సమర్థ నిఘా వ్యవస్థలే దీనికి సమాధానమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# ప్రజా సంతృప్తే లక్ష్యమన్న చంద్రబాబు

మెదటి పేజీ తరువాయి



అమరావతి, సెప్టెంబర్ 11 (మనప్రజాప్రతినిధి) ప్రభుత్వ పాలనలో ప్రజా సంతృప్తే అంతిమ లక్ష్యంగా పనిచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న ఆయన ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, పాలనలో ఆధునిక సాంకేతికత వినియోగం, ప్రజల్లో ప్రభుత్వంపై సానుకూల దృక్పథం పెంపొందించడం అనే మూడు కీలక అంశాలపై ప్రధానంగా దృష్టి సారించారు. క్షేత్రస్థాయిలో సమస్యలను వేగంగా పరిష్కరిం చడంతో పాటు ప్రభుత్వ పథకాలు ప్రజలకు సులభంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు కనిపించినప్పుడే పాలనకు నిజమైన అర్థం వస్తుందని పేర్కొన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)కు వచ్చే దరఖాస్తులను పూర్తి సంతృప్తికరంగా పరిష్కరించాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయిలో కలెక్టర్లు, నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలు, మండల స్థాయిలో అధికారులు తరచూ గ్రామాల్లో పర్యటించాలని సూచించారు. ప్రతి నెల కనీసం నాలుగుసార్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తే అనేక సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమవుతాయని అభిప్రాయపడ్డారు. ఈ పర్యటనలకు సంబంధించిన వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునే వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. పాలనలో టెక్నాలజీ వినియోగానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖలన్నీ టెక్నాలజీ ఇంటిగ్రేషన్‌తో పనిచేయాలని, ప్రతి రంగంలో డీప్ టెక్నాలజీని అమలు చేయాలని సూచించారు. దీని ద్వారా అదనపు అభివృద్ధి సాధించడంతో పాటు ప్రభుత్వ ఆదాయాన్ని కూడా పెంచుకోవచ్చని చెప్పారు. డేటా లేక్‌లో కచ్చితమైన సమాచారాన్ని నమోదు చేసేందుకు ప్రత్యేక విధివిధానాలు రూపొందించాలని ఆదేశించారు. ప్రతి శాఖ ఏఐ స్టాక్ టెక్నాలజీని వినియోగించాల్సిన అవసరం ఉందని, జీఎస్టీ రంగంలో ఇప్పటికే ఏఐ వినియోగం మంచి ఫలితాలు ఇస్తోందని వివరించారు. కోర్టుల్లో పేరుకుపోయిన కేసుల పరిష్కారానికి కూడా సాంకేతికతను వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. లీగల్ ఏఐ స్టాక్‌ను ఉపయోగించడం ద్వారా న్యాయవ్యవస్థలో పెండింగ్ కేసులను వేగంగా పరిష్కరించే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. భవిష్యత్ పాలన మొత్తం డేటా ఆధారితంగా, సాంకేతికత ఆధారితంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రజలకు సేవలందించే ప్రతి శాఖ సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించే దిశగా అడుగులు వేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో సానుకూల దృక్పథం పెంపొందించేందుకు అధికారులు కృషి చేయాలని చంద్రబాబు అన్నారు. ప్రజలకు సేవలు సులభంగా అందినప్పుడే ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. లోటుపాట్లను ఎప్పటికప్పుడు గుర్తించి సవరించుకోవాలని, సమర్థంగా పనిచేసే అధికారులను ప్రోత్సహించాలని సూచించారు. పనితీరు సరిగా లేని వారిపై అవసరమైన చర్యలు తీసుకోవాలని కూడా హెచ్చరించారు. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సిబ్బంది పనితీరును మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా స్పష్టమైన విధులతో కూడిన జాబ్ చార్ట్ రూపొందించాలని సూచించారు. కొందరిపై అధిక పనిభారం, మరికొందరిపై తక్కువ పనిభారం ఉన్న పరిస్థితిని సరిచేసి పనిని హేతుబద్ధీకరించాలని తెలిపారు. ప్రతి కార్యాలయానికి ఒక ఈవీ సైకిల్ అందించాలని కూడా ఆదేశించారు. ఇదే సమావేశంలో మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ జిల్లాల ఆర్థిక పరిస్థితులతో పాటు పాలనపై ప్రజల్లో ఉన్న సానుకూల దృక్పథానికి సంబంధించిన సమాచారాన్ని మంత్రులు, ప్రజాప్రతినిధులకు ఎప్పటికప్పుడు అందించాలని కలెక్టర్లను కోరారు. మొత్తం మీద ప్రజా సమస్యల పరిష్కారం, టెక్నాలజీ వినియోగం, సమర్థవంతమైన పాలన ద్వారానే ప్రభుత్వ లక్ష్యాలు సాధ్యమవుతాయని సమావేశంలో స్పష్టమైంది.

# స్థానిక ఎన్నికలపై కాంగ్రెస్ ఫోకస్

మెదటి పేజీ తరువాయి




అమరావతి, సెప్టెంబర్ 11 (మనప్రజాప్రతినిధి) ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఎన్నికల్లో పార్టీ ఉనికిని బలంగా చాటుకోవడంతో పాటు గరిష్ఠ సంఖ్యలో స్థానాలను కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని మరింత వేగవంతం చేయాలని నిర్ణయించిన ఆమె, రాష్ట్ర స్థాయిలో కీలక మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఎనిమిది మంది సీనియర్ నాయకులతో కూడిన రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీని ప్రకటించారు. ఈ అత్యున్నత కమిటీకి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు, మాజీ మంత్రి రఘువీరారెడ్డిని చైర్మన్‌గా నియమిస్తూ షర్మిల ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీకి ఉన్న అనుభవజ్ఞులైన నాయకత్వాన్ని ఎన్నికల నిర్వహణలో వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఎన్నికల ప్రక్రియ మొత్తం సమర్థంగా సాగేందుకు అవసరమైన సూచనలు, మార్గనిర్దేశం చేసే బాధ్యతలను రఘువీరారెడ్డి నిర్వహించనున్నారు. కమిటీ కన్వీనర్‌గా మాజీ కేంద్ర మంత్రి, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేడీ శీలంను నియమించారు. సభ్యులుగా సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, మాజీ కేంద్ర మంత్రులు పల్లంరాజు, కిల్లి కృపారాణి, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి, మాజీ రాజ్యసభ సభ్యుడు తులసిరెడ్డికి స్థానం కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల నిర్వహణ, ప్రచార వ్యూహాల రూపకల్పన, అభ్యర్థుల ఎంపిక వంటి అంశాల్లో వీరు కీలక పాత్ర పోషించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి సోషల్ మీడియా నిర్వహణతో పాటు ఎన్నికల సమన్వయ ఇన్‌చార్జి బాధ్యతలను నెల్లూరు డీసీసీ అధ్యక్షుడు కిరణ్ కుమార్ రెడ్డికి అప్పగించారు. సోషల్ మీడియా వేదికల ద్వారా పార్టీ ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం, ఎన్నికల ప్రచార కార్యక్రమాలను సమన్వయం చేయడం, కార్యకర్తలకు మార్గనిర్దేశం చేయడం వంటి బాధ్యతలను ఆయన నిర్వహించనున్నారు. డిజిటల్ ప్రచారానికి ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో ఈ బాధ్యతలు కీలకంగా మారనున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గరిష్ఠ సంఖ్యలో స్థానాలను గెలుచుకునేలా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని మానిటరింగ్ కమిటీకి షర్మిల స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల విధివిధానాల ఖరారు, గెలుపు అవకాశాలు ఉన్న అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాల అమలు, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యల పరిష్కారం వంటి అంశాలన్నింటినీ కమిటీ పర్యవేక్షించనుంది. పార్టీ బలోపేతం కోసం ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని ఆమె సూచించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు మానిటరింగ్ కమిటీతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని షర్మిల ఆదేశించారు. ఎన్నికల సమయంలో కార్యకర్తల మధ్య సమన్వయం పెంచడంతో పాటు ప్రజా సమస్యలను ప్రధాన అజెండాగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ రాజకీయ ప్రస్థానానికి కీలకంగా భావిస్తున్న నేపథ్యంలో షర్మిల తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

# సీఐఎస్ఎఫ్ సిబ్బందికి పదోన్నతులు

మెదటి పేజీ తరువాయి



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11 (మనప్రజాప్రతినిధి) సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్సీ) యూనిట్‌లో ప్రమోషన్ అండ్ పిప్పింగ్ సెరిమనీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 48 మంది కానిస్టేబుల్/జీడీ సిబ్బందికి హెడ్ కానిస్టేబుల్/జీడీ హోదాలకు పదోన్నతులు కల్పించారు. వారి అంకితభావం, కృషి, విధి నిర్వహణలో చూపిన ప్రతిభకు గుర్తింపుగా ఈ పదోన్నతులు లభించాయి. పదోన్నతి పొందిన సిబ్బంది కొత్త హోదాల్లో తమ బాధ్యతలను స్వీకరించారు. విధి నిర్వహణలో చూపిన క్రమశిక్షణ, నిబద్ధత, సేవా భావం కారణంగానే ఈ గుర్తింపు లభించిందని అధికారులు పేర్కొన్నారు. పదోన్నతులు సిబ్బందిలో మరింత ఉత్సాహాన్ని, బాధ్యతాయుతమైన సేవా దృక్పథాన్ని పెంపొందిస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమానికి డీఐజీ/డీఎంఆర్సీ సంతోష్ చాల్కే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు సీనియర్ కమాండెంట్లు గుర్జీత్ సింగ్, పాలియాంకాప్ తదితర అధికారులు పాల్గొన్నారు. పదోన్నతి పొందిన సిబ్బందికి కొత్త ర్యాంక్ గుర్తులను ధరింపజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పదోన్నతి అనేది కేవలం హోదా పెరుగుదల మాత్రమే కాదని, అదనపు బాధ్యతలకు ప్రతీక అని పేర్కొన్నారు. కొత్త బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ సంస్థ ప్రతిష్ఠను మరింత పెంచాలని సూచించారు. ప్రజల భద్రత, దేశ సేవలో మరింత నిబద్ధతతో పనిచేయాలని ఆకాంక్షించారు. సీఐఎస్ఎఫ్ దేశంలోని కీలక సంస్థలు, మౌలిక సదుపాయాల భద్రతలో కీలక పాత్ర పోషిస్తోందని అధికారులు తెలిపారు. డీఎంఆర్సీ వంటి రద్దీ ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేయడంలో సిబ్బంది సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. పదోన్నతులు పొందిన సిబ్బంది భవిష్యత్తులోనూ ఉత్తమ సేవలు అందిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమం సందర్భంగా పదోన్నతి పొందిన సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు. తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మరింత క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వర్తిస్తామని తెలిపారు. కొత్త హోదా తమకు గౌరవంతో పాటు మరింత బాధ్యతను తీసుకువచ్చిందని పేర్కొన్నారు.

# కల్వకుర్తి నీటి విడుదలపై బీఆర్ఎస్ డిమాండ్

మెదటి పేజీ తరువాయి

కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలోని అన్ని పంపులను వెంటనే ప్రారంభించి రైతులకు సాగునీరు అందించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో సాగునీటి అవసరం అధికంగా ఉన్నందున 24 గంటల పాటు నిరంతరాయంగా నీటి విడుదల చేపట్టాలని కోరారు. రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో రైతుల పంటలను కాపాడాలంటే రిజర్వాయర్లను పూర్తిస్థాయిలో నింపి సాగునీటిని అందుబాటులోకి తీసుకురావడం అత్యవసరమని తెలిపారు. నీటి నిర్వహణలో ప్రభుత్వం మరింత చురుకుదనం ప్రదర్శించాలని సూచించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. పంటలు ఎండిపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా ఆయకట్టు ప్రాంతాలకు సరిపడా నీరు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రస్తుత ప్రభుత్వం రైతుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. సాగునీటి అవసరాలను గుర్తించి వెంటనే అన్ని పంపులను ప్రారంభించకపోతే రైతులు మరింత నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. వ్యవసాయ రంగాన్ని కాపాడేందుకు ప్రభుత్వం అత్యవసర ప్రణాళికతో ముందుకు రావాలని

# పేదల గృహ కలను సాకారం చేసిన కాంగ్రెస్

మెదటి పేజీ తరువాయి




మరిన్ని ప్రాంతాలకు విస్తరించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.720 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాల్సిన అవసరం ఉందని మహేష్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. నిధుల విడుదలతో గృహ నిర్మాణ కార్యక్రమాలు మరింత వేగంగా ముందుకు సాగుతాయని తెలిపారు. పేదల సంక్షేమానికి సంబంధించిన అంశాల్లో కేంద్రం సహకారం అందించాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణ రంగం నిర్లక్ష్యానికి గురైందని ఆయన విమర్శించారు. ఇళ్ల అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకున్నారని ఆరోపించారు. పేదల సమస్యల పరిష్కారంలో గత ప్రభుత్వం విఫలమైందని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం గృహ నిర్మాణాన్ని ప్రాధాన్య అంశంగా తీసుకుని ముందుకు సాగుతోందని చెప్పారు. పేదవాడి సొంతింటి కలను పూర్తిస్థాయిలో నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. గృహ నిర్మాణ కార్యక్రమాలను మరింత వేగవంతం చేసి అర్హులైన ప్రతి కుటుంబానికి ఇల్లు అందించే దిశగా చర్యలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. పేదల జీవితాల్లో స్థిరత్వం తీసుకురావడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం




మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట సెప్టెంబర్ 11:చేగుంట మండల పరిధిలోని చందాయిపేట్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట ఆధ్వర్యంలో, సూరారం మల్లారెడ్డి హాస్పిటల్ సౌజన్యంతో శుక్రవారం నిర్వహించిన ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌కు విశేష స్పందన లభించింది. డిస్ట్రిక్ట్ హెల్త్ క్యాంప్స్ చైర్మన్ స్వర్గం సిద్ధిరాములు పర్యవేక్షణలో చేపట్టిన ఈ శిబిరంలో మల్లారెడ్డి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రుతన్, డాక్టర్ ఆకాంక్ష, మార్కెటింగ్ మేనేజర్ పవన్ బృందం 215 మంది గ్రామస్తులకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ రాజనకు రామచంద్రం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు మెరుగైన కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను చేరువ చేయడమే తమ సంస్థ ప్రధాన సంకల్పమని, భవిష్యత్తులోనూ మరిన్ని ఆరోగ్య సేవా కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. అనంతరం వైద్యులు ప్రజలకు ముందస్తు ఆరోగ్య పరీక్షలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ డిస్ట్రిక్ట్ సెక్రటరీ ఆకుల సుఖేందర్, క్లబ్ సెక్రెటరీ బుర్కా నాగరాజు, సర్పంచ్ తాలుక మహేశ్వరి సాయిబాబా, ఉప సర్పంచ్ పబ్బా నాగేష్ గుప్తా పంచాయతీ కార్యదర్శి కృష్ణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మట్టితో వినాయక ప్రతిమలు...
# పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల సందేశం

(మన ప్రజా ప్రతినిధి సెప్టెంబర్ 11):దొమ్మాట: దొమ్మాట గ్రామంలోని ఎం.పీ.పీ.ఎస్ పాఠశాలలో ముందస్తు వినాయక చవితి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్వయంగా మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను పాఠశాలలో ప్రదర్శించి ఆకట్టుకున్నారు. సంప్రదాయ పండుగను పర్యావరణ పరిరక్షణతో ముడిపెడుతూ విద్యార్థులు నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశం మాట్లాడుతూ.. వినాయక చవితి పండుగ సందర్భంగా మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను ఉపయోగించడం ద్వారా పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయడం వల్ల జల కాలుష్యం, భూ కాలుష్యం ఏర్పడే అవకాశం ఉందని, అందువల్ల ప్రతి ఒక్కరూ పర్యావరణహితమైన మట్టి వినాయకులను ప్రోత్సహించాలని సూచించారు. అలాగే వినాయక చవితి పండుగ విశిష్టత, ఆధ్యాత్మిక ప్రాధాన్యతతో పాటు పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి బాధ్యతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ఎంతో ఆసక్తితో మట్టి వినాయక ప్రతిమలను తయారు చేసి ప్రదర్శించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నిర్మల, సుధాకర్ రెడ్డి, మౌనిక, స్వప్న, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. పర్యావరణహిత వినాయక చవితి నిర్వహణపై విద్యార్థులు ఇచ్చిన సందేశాన్ని తల్లిదండ్రులు అభినందించారు.

# మానవత్వం చాటుకున్న లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్



దౌల్తాబాద్ మన ప్రజాప్రతినిధి ముకుంద్ సెప్టెంబర్ 11:దౌల్తాబాద్ మండలం కోనాయిపల్లి గ్రామానికి చెందిన గౌలపల్లి సతీష్ కుటుంబానికి లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ ఆర్థిక సహాయం అందించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. సతీష్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం లో మరణించిన విషయం తెలుసుకున్న డాక్టర్ మోహన్ నాయక్ వారి కుటుంబాన్ని పరామర్శించి వెంటనే 5000 రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్ నాయక్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, తన వంతు సహాయంగా ఈ ఆర్థిక సాయం అందించానని తెలిపారు. సతీష్ కుటుంబ సభ్యులు డాక్టర్ మోహన్ నాయక్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమ కష్టకాలంలో అండగా నిలిచిన మోహన్ నాయక్ సహాయాన్ని ఎప్పటికీ మరువలేమని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్, ముత్యం రెడ్డి, శాతవాహన స్కూల్ ప్రిన్సిపల్ తారా సింగ్, రాజు, తేజ,అశోక్, శివ, మల్లేశం,బుచ్చయ్య,సందీప్,కరుణార్ సురేష్ శంకరమ్మ ఎల్లమ్మ నరసమ్మ కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పరామర్శలో ప్రెసిడెంట్



దోమ, ప్రజాప్రతినిధి, (సెప్టెంబర్ 11):దోమ మండల పరిధిలోని బాస్ పల్లి గ్రామ పంచాయతి మాజీ సర్పంచ్ అత్త అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకున్న దోమ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొరశెట్టి శాంత్ కుమార్ పరామర్శిస్తూ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బాస్ పల్లి సర్పంచ్ అనంతయ్య,కాంగ్రెస్ నాయకులు ,గ్రామస్థులు,తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులపై ముదిరాజుల ఖండన



దోమ,ప్రజా ప్రతినిధి, (సెప్టెంబర్ 11):అక్రమ అరెస్టులపై ముదిరాజులు తీవ్రంగా ఖండించారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ముదిరాజ్ చైతన్య వేదికతెలంగాణ ఆధ్వర్యంలో ఛలో అసెంబ్లీముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో, రాష్ట్ర వ్యాప్తంగా ముదిరాజ్ నాయకులను, కార్యకర్తలను ముందస్తుగా అరెస్టులు చేసి నిర్బంధించారు. ఈ సందర్బంగా దోమ మండల ముదిరాజ్ నాయకులు మాట్లాడుతూ ముదిరాజ్ లను బిసి–ఏ లోకి మార్చాలని, ముదిరాజ్ కార్పొరేషన్‌కు ₹1,000 కోట్లు కేటాయించాలని,చేప పిల్లల పంపిణీలో అవినీతిని అరికట్టి, ముదిరాజ్‌లకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. ముదిరాజ్‌ల హక్కులు, వాటా, సామాజిక న్యాయం కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడుతున్న నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులను అణచివేయడమన్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అరెస్టు చేసిన ముదిరాజ్ నాయకులను, కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలన్నారు. ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో మా పోరాటం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దోమ మండల మాజీ జెడ్పిటిసి లక్ష్మయ్య ముదిరాజ్,దోమ మండల ముదిరాజ్ సంఘం ప్రధాన కార్యదర్శి చందు ముదిరాజ్, నర్సిములు ముదిరాజ్, ముదిరాజ్,శివ ముదిరాజ్, వెంకటేష్ ముదిరాజ్,చంద్రశేఖర్ ముదిరాజ్, పెంటయ్య ముదిరాజ్,మైపాల్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజ్ హక్కుల కోసం ఛలో అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా ముదిరాజుల అరెస్ట్



మనప్రజాప్రతినిధి//తెలుగు దినపత్రిక సెప్టెంబర్ 11 చిన్నకోడూరు: అరెస్టులతో ముదిరాజుల ఉద్యమాన్ని ఆపలేరు!ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి. ముదిరాజ్ హక్కుల సాధన కోసం ధర్మయుద్ధం కొనసాగిస్తాం!జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్. ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు. శుక్రవారం నాడు ముదిరాజులను అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా చిన్నకోడూర్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ గారు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడికాయల వెంకటేశం, వైస్ ఎంపీపీ కీసరి పాపయ్య, సర్పంచ్ లు యాట యాదగిరి, రేగుల దేవయ్య, వంకాయల చెరుకు సంతోష్, మాజీ సర్పంచ్ పెండ్యాల బాలయ్య లతో కలసి మాట్లాడుతూ ముదిరాజ్ సమాజానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, సామాజిక న్యాయం, రాజకీయ ప్రాతినిధ్యం, ఆర్థిక అభివృద్ధి కల్పించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన “ముదిరాజ్ చలో అసెంబ్లీముట్టడి” కార్యక్రమానికి వెళ్లకుండా ముదిరాజ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ అరెస్టలతో ముదిరాజ్‌ల హక్కుల కోసం సాగుతున్న ఉద్యమాన్ని అణచివేయలేరని ఆయన స్పష్టం చేశారు. ముదిరాజ్ సమాజానికి ప్రభుత్వం ఇచ్చిన హామీలు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా వాటిని కార్యరూపంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా సామాజిక, ఆర్థిక, రాజకీయంగా వెనుకబడిన ముదిరాజ్ సమాజానికి న్యాయం జరగాలంటే ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. BC`Aలోకి వెంటనే చేర్చాలి!దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి గారు 2009లో జీఓ 15/09 ద్వార ముదిరాజులను బి.సి “డి“ నుండి బి.సి “ఏ“ లోకి మార్చడం జరిగింది కాని కొందరు ఓర్వలేక కోర్ట్ ద్వార ఆ జీఓ ను నిలివేస్తూ ఆర్డర్ ఇచ్చిన దాని మల్లి పునరుదరించాలని గౌ సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేటికి ముదిరాజుల గురించి ఆలోచన చేయకపోవడం మమ్ములను అవమానించడమే అన్నారు ముదిరాజ్‌లను దీజ–ూా కేటగిరీలోకి వెంటనే చేర్చి రిజర్వేషన్ హక్కులు కల్పించాలి అని ఆయన డిమాండ్ చేశారు. విద్య, ఉద్యోగాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలలో తగిన అవకాశాలు పొందేందుకు వర్గీకరణ అంశాన్ని ప్రభుత్వం ప్రాధాన్యతతో పరిష్కరించాలన్నారు. ముదిరాజ్ కార్పొరేషన్‌కు రూ. 1,000 కోట్లుముదిరాజ్ సమాజ ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ముదిరాజ్ కార్పొరేషన్‌కు రూ. 1,000 కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆ నిధులతో పేద ముదిరాజ్ కుటుంబాలకు ఉపాధి, విద్య, స్వయం ఉపాధి, ఆర్థిక సహాయం వంటి కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని కోరారు. చేప పిల్లల పంపిణీలో పారదర్శకత కావాలి!మత్స్యకారుల జీవనోపాధికి కీలకమైన చేప పిల్లల పంపిణీ కార్యక్రమంలో అక్రమాలు, అవినీతికి తావులేకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అర్హులైన ముదిరాజ్ మత్స్యకారులకు నాణ్యమైన చేప పిల్లలు అందేలా పారదర్శకమైన విధానం రూపొందించాలని డిమాండ్ చేశారు. రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి!ముదిరాజ్ సమాజానికి జనాభా ప్రాతిపదికన తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు, ఇతర ప్రజాప్రతినిధిత్వ అవకాశాల్లో ముదిరాజ్‌లకు సముచిత స్థానం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరుప్రజాస్వామ్య పద్ధతిలో తమ హక్కుల కోసం ప్రశ్నిస్తున్న నాయకులను అరెస్ట్ చేయడం ద్వారా సమస్యలు పరిష్కారం కావని జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. అరెస్టులు, నిర్బంధాలు తమ ఉద్యమ స్ఫూర్తిని మరింత పెంచుతాయని పేర్కొన్నారు. ముదిరాజ్ సమాజానికి ఇచ్చిన హామీలను ప్రభుత్వం తుంగలో తొక్కకుండా తక్షణమే అమలు చేయాలని, లేదంటే ప్రజాస్వామ్య పద్ధతుల్లో మరింత విస్తృతంగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. ముదిరాజ్‌ల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం తమ పోరాటం ఆగదని, ప్రభుత్వం స్పందించే వరకు ధర్మయుద్ధాన్ని కొనసాగిస్తామని జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ స్పష్టం చేశారు. అరెస్టు ఐన వారిలో జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, మేడికాయల వెంకటేశం, కీసరి పాపయ్య, యాట యాదగిరి, రేగుల దేవయ్య, వంకాయల చెరుకు సంతోష్, మాజీ సర్పంచ్ పెండ్యాల బాలయ్య, చెరుకు నారాయణ, పడిగె లింగం, తుమ్మల శ్రీనివాస్, తుమ్మల తిరుపతి, ఉప్పరబోయిన సంతోష్, ఉప్పరబోయిన మహేష్, జంగిటి వెంకట్ తదితరులు ఉన్నారు.



# సెప్టెంబరు 12, 13 తేదీల్లో ప్రత్యేక ఓటరు ప్రచార కార్యక్రమం



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక సూర్యాపేట జిల్లా:జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండనున్న బీఎల్‌ఓలు భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)–2026 కార్యక్రమంలో భాగంగా ఈ నెల 12, 13 తేదీలలో జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. ఈ రెండు రోజుల పాటు జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో సంబంధిత బీఎల్‌ఓలు, బీఎల్‌ఓ సూపర్‌వైజర్లు అందుబాటులో ఉంటారన్నారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించి ఫారం–6, 7, 8లతో పాటు డిక్లరేషన్ ఫారాలు పోలింగ్ కేంద్రాల్లో సేకరిస్తారని వివరించారు. ప్రతి ఓటరు సమీపంలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి సర్–2026 డ్రాఫ్ట్ నోటిఫికేషన్, ఏఎస్డీడీ జాబితాలో తమ పేర్లు సరైన వివరాలతో ఉన్నాయో లేదో సరిచూసుకోవాలని కలెక్టర్ కోరారు. కొత్త ఓటరు నమోదుకు ఫారం–6, పేరు తొలగింపు లేదా అభ్యంతరాలకు: ఫారం–7,చిరునామా, పేర్ల సవరణలకు ఫారం–8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సర్ ప్రక్రియలో భాగంగా నో మ్యాపింగ్ లేదా అనోమలీస్ కింద నోటీసులు అందుకున్న ఓటర్లు వాటిని నిర్లక్ష్యం చేయకుండా బీఎల్‌ఓలకు అవసరమైన ఆధార పత్రాలు అందజేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సందేహాలు ఉన్న ఓటర్లకు ప్రక్రియను వివరించి సహకరించాల్సిందిగా బీఎల్‌ఓలను ఆదేశించినట్లు చెప్పారు. యువ ఓటర్లకు విజ్ఞప్తి 1.10.2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న లేదా ఆ తేదీ నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకోనున్న అర్హత కలిగిన యువత తమ పేరు ఓటరు జాబితాలో నమోదైందో లేదో పరిశీలించుకోవాలని, పేరు నమోదు కాకపోతే ఫారం–6 తో పాటు వాంగ్మూలం (డిక్లరేషన్ )సమర్పించడం ద్వారా నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి విజ్ఞప్తి చేశారు. ఖచ్చితమైన, పారదర్శకమైన ఓటరు జాబితా రూపొందించడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డిఆర్‌ఓ ప్రేమ్ రాజ్, ఎలక్షన్ సిబ్బంది రాజేందర్ రెడ్డి, భరత్, రణధీర్, తదితరులు పాల్గొన్నారు

## ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పనులను వేగవంతం చేయాలి



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక సూర్యాపేట జిల్లా:జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూర్యాపేట జిల్లాలో మూడు నియోజక వర్గాలలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పనుల పురోగతి పై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ శుక్రవారం కలెక్టరేట్ వి సి హాల్ నందు సమీక్ష సమావేశం నిర్వహించారు.ఇట్టి సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ 200 కోట్ల రూపాయల వ్యయంతో హుజూర్నగర్ నియోజకవర్గం గడ్డిపల్లి, కోదాడ నియోజక వర్గం చిలుకూరు, తుంగతుర్తి నియోజకవర్గం తొండ లలో మొత్తం 3 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి 600 కోట్ల రూపాయలు ఖర్చు చేయటం జరుగుతుందని,నిర్మాణ పనుల పురోగతి పై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. పనులను అనుకున్న సమయానికి పూర్తి చేయాలని పనులను నాణ్యత ప్రకారం ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ఇచ్చిన ఆర్కిటెక్చర్ డిజైన్ ప్రకారం నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. మిగిలినటువంటి సమగ్ర శిక్ష అభియాన్ పనులను కూడా అనుకున్న సమయం ప్రకారం పూర్తి చేయాలని ఇట్టి పనుల పురోగతిపై ప్రతివారం సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు.ఈ సమీక్ష సమావేశంలో సూపర్డెంట్ ఇంజనీర్ భాను ప్రసాద్, డిఇఓ అశోక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్ కుమార్, ఏ ఈ ఓబులేష్, గుత్తందారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి
## సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్



మన(ప్రజా(ప్రతినిధి)రాజన్న సిరిసిల్ల సెప్టెంబర్, 11:రాబోయే గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో వైభవంగా నిర్వహించాలని సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఉత్సవాల సందర్భంగా సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో పీస్ కమిటీ, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో ఆయన ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, విగ్రహాల ప్రతిష్ఠాపన నుంచి పూజా కార్యక్రమాలు మరియు నిమజ్జనం వరకు నిర్వాహకులు పాటించాల్సిన పలు నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. గణేష్ మండపాల నిర్వాహకులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ, పోలీసు శాఖ ఇచ్చే సూచనలను తప్పక పాటించాలని కోరారు. ఉత్సవాలు సజావుగా, శాంతియుతంగా పూర్తయ్యేలా పీస్ కమిటీ, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసులకు పూర్తి స్థాయిలో సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## వినాయక చవితి సందర్భంగా ప్రత్యేక సూచనలు




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మహబూబ్ నగర్ జిల్లా:మహబూబ్‌నగర్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్దప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి: జిల్లా ఎస్పీ మహబూబ్‌నగర్ పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి, ఐపీఎస్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి, స్టేషన్ నిర్వహణ, పెండింగ్ కేసులు, ఫిర్యాదుల పరిష్కారం, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదగా వ్యవహరించి, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కేసుల దర్యాప్తులో నాణ్యతతో పాటు వేగం పెంచాలని, పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తును పూర్తి చేయాలని ఆదేశించారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు.మహబూబ్‌నగర్ పట్టణంలో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి ప్రధాన వాణిజ్య ప్రాంతాలు, రద్దీగా ఉండే రహదారులు, మార్కెట్ ప్రాంతాలు కలిగి ఉన్నందున ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ ఆదేశించారు. ముఖ్యంగా రద్దీ సమయాల్లో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ చర్యలు చేపట్టాలని, నో-పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాల నిలుపుదలను నియంత్రించాలని, పాదచారులు మరియు వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని సూచించారు.వినాయక చవితి మరియు నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ సూచించారు. వన్‌టౌన్ పరిధిలో ఏర్పాటు చేసే వినాయక మండపాల వద్ద భద్రతా చర్యలను పర్యవేక్షించాలని, మండప నిర్వాహకులు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.వినాయక మండపాలు, ఊరేగింపులు మరియు నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికతో బందోబస్తు ఏర్పాటు చేయాలని, రద్దీ ప్రాంతాల్లో అదనపు సిబ్బందిని వినియోగించాలని సూచించారు. మండపాల వద్ద విద్యుత్ భద్రత, అగ్ని ప్రమాదాల నివారణ, శబ్ద పరిమితులు, రహదారుల ఆక్రమణ వంటి అంశాలపై నిర్వాహకులకు అవగాహన కల్పించాలని తెలిపారు.అలాగే ఉత్సవాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సున్నితమైన ప్రాంతాలను గుర్తించి నిరంతరం పర్యవేక్షించాలని, రాత్రి వేళల్లో గస్తీని పెంచాలని, అనుమానాస్పద వ్యక్తులు మరియు వాహనాల కదలికలపై నిఘా ఉంచాలని సూచించారు.ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు పోలీసులకు సహకరించి శాంతియుత వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించాలని ఎస్పీ కోరారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ 8712659360 లేదా ఎమర్జెన్సీ నంబర్ 112కు సమాచారం అందించాలని సూచించారు.ఈ తనిఖీ సందర్భంగా వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్యతో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## మండల ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం



మన ప్రజాప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట సెప్టెంబర్ 11:చేగుంట ఉత్తమ ఉపాధ్యాయులు గా ఎన్నికైనటువంటి వారిని ఘనంగా సన్మానించిన ఎంపీడీఓ చిన్నారెడ్డి, ఎంఈఓ నీరజ , ఎంపీడీవో చిన్నారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది, దేశ భవిష్యత్తు తరగతి గదులలో నిర్మింపబడుతుందని అన్నారు. మండల విద్యాధికారి నీరజ మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని, ఉపాధ్యాయులు జాతి నిర్మాతలని, సర్వేపల్లి రాధాకృష్ణన్ మొదట ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి అంచలంచలుగా ఎదిగి రాష్ట్రపతిగా అయి ఆ వృత్తికి వన్నెతెచ్చిన మహానుభావుడు అని అన్నారు. సర్పంచ్ సంద్రుకు స్రవంతి సతీష్ మాట్లాడుతూ అన్ని వృత్తులను తయారు చేసే ఏకైక వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని, ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలు అని అన్నారు . ఉపసర్పంచి మమ్మద్ రఫీ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల కీలకపాత్ర పోషించాలని, అన్నారు. మండల ఉత్తమ ఉపాధ్యాయులు ఎన్నికైన ఉపాధ్యాయులు పీజీహెచ్ఎం లతాంబరావు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ చంద్రకళ, సిద్ధి రాములు, సప్న, శ్రీవాణి, కాజా మొయినుద్దీన్, వెంకటేశ్వర్లు, సంధ్యారాణి, శ్రీనివాస్ రావు, ప్రభాకర్, శ్రీనివాస్ గౌడ్, వెంకయ్య, పూర్ణచందర్, తిరుపతి, నర్సింలు, ఎల్లయ్య, సంగీత, జ్యోతిర్మయి, చరందాస్, వనిత, శ్రీలత, స్వప్న, రంజిత్, నాగరాజు, గిరిజ రాష్ట్ర జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన, సత్యనారాయణ, విట్టల్ రెడ్డి, రవిబాబు మరియు సి అర్ పి రమేష్, సంతోష్ రెడ్డి, ప్రవీణ్, వినోద లను సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం కృష్ణారావు , వెంకటరాంరెడ్డి, చందాయిపేట హెచ్ఎం విట్టల్ రెడ్డి, ఉపాధ్యాయుల సంఘాల, ఎల్ ఎఫ్ ఎల్ హెచ్ ఎం నవాత్ సురేష్, సిద్ది రెడ్డి, నాయకులు, గజగట్లనాగరాజు, కొంతాలపల్లి పెంటా గౌడ్, మణిరామ్, రావుల వెంకటేష్, జగన్ లాల్ నరసింహారావు, మల్లికార్జున్, మనోహర్రావు, తిరుపతి రెడ్డి, తంగేళ్లపల్లికి కృష్ణమూర్తి, బాల పోచయ్య, దేవరాజ్, రాజశేఖర్, వివిధ సంఘాల నాయకులు, చల్లా లక్ష్మణ్, వారాల నరసింహులు,పాండు, రాజశేఖర్, రామచంద్రం, కిషన్, రాఘవేంద్ర, బాలకిషన్, రమ, , సిద్ధిరాములు, యాదగిరి, రామకృష్ణ, శ్రీనివాస్, సరస్వతి, రాధా, రమ, రమాదేవి,తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే పీహెచ్డీ సాధించిన దీపా బానోత్



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్ :కాప్రా ఈసీఐఎల కూ చెందిన ఉస్మానియా యూనివర్సిటీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ పరిశోధక విద్యార్థిని శ్రీమతి డా.దీపా బానోత్ బిజినెస్ మేనేజ్‌మెంట్ పీహెచ్‌డీ పట్టా సాధించారు. ఇద్దరు పిల్లల తల్లిగా, గృహిణిగా కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే పరిశోధనను విజయవంతంగా పూర్తి చేసి డాక్టరేట్ పొందడం అభినందనీయం. డా.దీపా బానోత్ "తెలంగాణలో ఎంపిక చేసిన ప్రభుత్వ మరియు ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో ఉద్యోగుల సంతృప్తిపై తులనాత్మక అధ్యయనం (తెలంగాణ రాష్ట్రంలోని ఎంపిక చేసిన పబ్లిక్ మరియు ప్రైవేట్ విశ్వవిద్యాలయాలలో ఉద్యోగుల సంతృప్తిపై తులనాత్మక అధ్యయనం)" అనే అంశంపై పరిశోధన జరిగింది. ఉన్నత విద్యా సంస్థల్లో ఉద్యోగుల సంతృప్తికి తగిన సూచనలను కూడా ప్రతిపాదించారు. ఈ పరిశోధనను డా. వి .సమున్నత గారి పర్యవేక్షణలో పూర్తి చేశారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ శ్రీరాములు, డీన్ ప్రొఫెసర్ జహంగీర్, డిపార్ట్‌మెంట్ హెడ్ ప్రొఫెసర్ విద్యాసాగర్ రావు, అధ్యాపకులు, పరిశోధకులు మరియు సిబ్బంది డా. దీపా బానోత్‌ను అభినందించారు. ఇద్దరు పిల్లల తల్లిగా కుటుంబ బాధ్యతలను (పెద్ద కుమారుడు ఎంబీబీఎస్ మరియు చిన్న కుమారుడు ఇంజనీరింగ్) చదువుతున్న సమయంలోనూ కుటుంబ భాద్యతలు చూసుకుంటూ పీహెచ్‌డీ సాధించడం ద్వారా దీపా బానోత్ తన సంకల్పం, పట్టుదల, కృషితో కుటుంబ బాధ్యతలు ఉన్నా ఉన్నత లక్ష్యాలను సాధించినట్లు నిరూపించారు. ఈ సందర్భంగా డా. దీపా బానోత్ తన విజయానికి సహకరించిన తన భర్త శ్రీ రవి తేజకు, కుటుంబ సభ్యులకు మరియు తన పరిశోధన పర్యవేక్షకురాలు డా.వి. సమున్నతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పరిశోధన సమయంలో వారు అందించిన నిరంతర ప్రోత్సాహం, సహకారం తన పీహెచ్డీ ప్రయాణంలో కీలకమని ఆమె పేర్కొన్నారు.ఆమె సాధించిన ఈ విజయం కుటుంబ బాధ్యతలతో పాటు ఉన్నత విద్యను కొనసాగించాలని ఆకాంక్షించే మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.




## పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట, సెప్టెంబర్ 11: నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, ఆపదలో ఉన్న ప్రతి పేద కుటుంబానికి సీఎం సహాయనిధి ద్వారా ప్రభుత్వం కొండంత అండగా నిలుస్తోందని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం చేగుంట, నార్సింగి మండల 23 మంది లబ్ధిదారులకు పట్టణం లోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన 23 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఇందులో చేగుంటకు చెందిన నలుగురు, బోనాలకు ఇద్దరు, బోనాల కొండాపూర్ ఒకరు, కన్యారం రాంపూర్ ఇద్దరు, గొల్లపల్లి ఇద్దరు, మక్కరాజ్‌పేట ఒకరు, పొలంపల్లి ఒకరు, పెద్దశివనూర్ ముగ్గురు, జైత్రంతాండా ఒకరు, ఇబ్రహీంపూర్ ఒకరు, రెడ్డిపల్లి ఇద్దరు, వడియారం గ్రామానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా చెరుకు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూనే, ప్రజల ఆరోగ్య, ఆర్థిక కష్టాలను తీర్చడంలో ప్రజా ప్రభుత్వం ముందుంటుందని, నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చేగుంట మార్కెట్ కమిటీ చైర్మన్ తాడేం వెంగళ రావు, పట్టణ సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్, వడియారం సర్పంచ్ సాయికుమార్ గౌడ్, రెడ్డీపల్లి సర్పంచ్ నర్సిములు,, చేగుంట పట్టణ అధ్యక్షులు మోహన్ నాయక్, చేగుంట మహంకాళి ఆలయ కమిటీ చైర్మన్ సంద్రుగు సతీష్, , ఏఎంసీ డైరెక్టర్లు మొజామిల్, స్టాలిన్ నర్సింలు,బాల రెడ్డి, శ్రీధర్ రెడ్డి,ఉపసర్పంచ్‌లు చౌదరి శ్రీనివాస్, జనరల్ సెక్రటరీలు కోండి శ్రీనివాస్,రాంపూర్ మాజీ సర్పంచ్ కాషాబోయిన భాస్కర్, సంద్రుగు శ్రీకాంత్,సాబెర్ వివిధ గ్రామాల సర్పంచ్ లు, ఉపసర్పంచ్ లు,సినియర్ నాయకులు కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాల నిర్వహణకు సహకారించాలి



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:పోలీస్ కమిషనర్ కార్యాలయం ఖమ్మం శాంతి కమిటీల సమన్వయ సమావేశంలో పోలీస్ కమిషనర్ వినాయక నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాన్ని శాంతి సామరస్యాన్ని కాపాడుకుంటూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పోలీసు కమిషనర్ సునీల్ దత్ సూచించారు. సెప్టెంబర్ 14 నుంచి ప్రారంభం కానున్న గణేశ్ నవరాత్రుల ఉత్సవాల కోసం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు.పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పీస్ కమిటీలతో వినాయక నవరాత్రి విగ్రహాల ఏర్పాట్లు, బందోబస్తుపై పోలీసు కమిషనర్ కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... కమిషనరేట్ పరిధిలో జరుపుకొనే అతి పెద్ద ఉత్సవాల్లో ఒకటైన గణేష్ వేడుకలను ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మతపరమైన సామరస్యాన్ని కాపాడుతూ అన్ని వర్గాల ప్రజలు పరస్పరం సహకరించుకోవాలన్నారు. అదేవిదంగా సోషల్ మీడియాలో వచ్చే పుకార్లు, తప్పుడు ప్రచారాన్ని నమ్మకుండా ప్రజలకు అవగాహన కల్పించడం. అనుమానాస్పద సమాచారం లేదా సమస్యలు ఎదురైతే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు.గణేష్ నవరాత్రుల ఉత్సవాలు శాంతియుతంగా, సురక్షితంగా, భక్తిశ్రద్ధలతో జరిగేలా భద్రతకు సంబంధించి, పోలీసు, నగరపాలక సంస్థ , అగ్ని మాపక శాఖ, నీటి పారుదల శాఖ, వైద్య శాఖ, విద్యుత్, రవాణా తదితర శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి సమన్వయంగా పనిచేస్తూ, శాంతియుత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు సజావుగా జరుపుకునేలా పోలీసు శాఖ అన్ని ముందస్తు చర్యలు చేపడుతోందని తెలిపారు.గణేష్ శోభాయాత్రలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా నిర్వహించడానికి పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శాంతి కమిటీ సభ్యులు పోలీసులు సమన్వయం చేసుకుంటూ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు.వినాయక విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనం సమయంలో నిర్ణయించిన మార్గాలు, సమయాలను తప్పనిసరిగా పాటించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. మతపరమైన సామరస్యాన్ని కాపాడుతూ అన్ని వర్గాల ప్రజలు పరస్పరం సహకరించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ మోహన్ బాబు, బాలకృష్ణ భానుప్రకాష్ పాల్గొన్నారు.

## నేరేడుచర్ల ఉన్నతపాఠశాలలో హిందీ దివాస్ వేడుకలు



నేరేడుచర్ల (మన ప్రజా ప్రతినిధి దినపత్రిక )పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నేరేడుచర్ల నందు సెప్టెంబర్ 14 హిందీ దివస్ పురస్కరించుకొని ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్రానికి అనుసంధానింపబడ్డ హర్యానా రాష్ట్ర ప్రజల వేషధారణలు,నాట్యం, నాటికలతో విద్యార్థినీ,విద్యార్థుల ప్రదర్శనలు అందరినీ అలరించాయి కార్యక్రమంలో హర్యానా ప్రజల భాష,ఆహారపు అలవాట్లు,సంస్కృతి సంప్రదాయాలు,ముఖ్యమైన పండుగలు, జీవన విధానం గురించి అవగాహన కల్పించారు భారత స్వాతంత్రోద్యమంలో భారతీయులను ఏకం చేయడంలో హిందీ మహోన్నత పాత్రను పోషించిందని ప్రధానోపాధ్యాయులు బట్టు మధు మరియు హిందీ భాషా ఉపాధ్యాయిని ఎం నాగమణి సందేశమిస్తూ అన్నారు ఇట్టి కార్యక్రమాల ద్వారా భిన్నత్వంలో ఏకత్వం సాధించవచ్చు అన్నారు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు

# విజిలెన్స్ దాడులు ఆపాలి, బకాయిలు చెల్లించాలి
## సిరిసిల్ల కలెక్టరేట్ వద్ద రైస్ మిల్లర్ల మహాధర్నా



మనప్రజాప్రతినిధి/రాజన్న సిరిసిల్లసెప్టెంబర్ ,11 :రైస్ మిల్లర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా మిల్లర్లు, మిల్లు సిబ్బంది, హమాలీలు కలెక్టరేట్ ఎదుట నల్ల కండువాలు ధరించి మహా ధర్నా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మిల్లులను బంద్ చేసి, సమస్యలు తేలే వరకు నిరవధిక సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా రా రైస్ మిల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పబ్బ నాగరాజు, బాయిల్డ్ రైస్ మిల్ జిల్లా అధ్యక్షుడు చేపూరి నాగరాజు మాట్లాడుతూ.. గత 48 రోజులుగా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడుల పేరుతో మిల్లర్లపై కేసులు నమోదు చేస్తూ జైళ్లకు పంపడం, వారిని దొంగలుగా చిత్రీకరిస్తూ మానసిక క్షోభకు గురిచేయడం సరికాదని మండిపడ్డారు. కొద్దిమంది చేసిన తప్పులకు మిల్లర్లందరినీ బాధ్యులను చేయడం దారుణమన్నారు. రైస్ మిల్లర్ల డిమాండ్స్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులను తక్షణమే ఆపివేయాలి. సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) బకాయిలపై విధించిన 25 శాతం పెనాల్టీ, 12 శాతం వడ్డీని వెంటనే రద్దు చేయాలి. 2014 నుంచి పెండింగ్‌లో ఉన్న మిల్లింగ్, స్టోరేజీ, హమాలీ చార్జీలు, కమీషన్ బకాయిలను క్వింటాలుకు 150 రూపాయల చొప్పున చెల్లించాలి. ఖరీఫ్ ధాన్యాన్ని పూర్తిగా రా రైస్‌గా, రబీ ధాన్యాన్ని బాయిల్డ్ రైస్‌గా మాత్రమే స్వీకరించాలి. రైస్ మిల్లులకు సబ్సిడీపై విద్యుత్ సరఫరా చేయడంతో పాటు, ప్రభుత్వ విధానాల వల్ల నష్టపోయిన డిఫాల్ట్ మిల్లర్లకు బకాయిలు నాలుగు విడతల్లో చెల్లించే వెసులుబాటు కల్పించాలి. మిల్లుల అప్‌గ్రేడేషన్ కోసం కోట్ల రూపాయలు వెచ్చించినా, ప్రభుత్వం కనీస బకాయిలు చెల్లించకుండా సీఎంఆర్ త్వరగా ఇవ్వాలని ఒత్తిడి చేయడం తగదని వారు పేర్కొన్నారు. నిరసన అనంతరం కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించిన మిల్లర్లను పోలీసులు అడ్డుకోగా, జాయింట్ కలెక్టర్ (జేసీ) నగేష్‌కు తమ 13 ప్రధాన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సమస్యలు పరిష్కరించే వరకు వెనక్కి తగ్గేదే లేదని స్పష్టం చేశారు.

## విత్తన గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం.. గ్రీన్..



మన ప్రజా ప్రతినిధి కొండపాక మండల్:గ్రీన్ ఇండియా ఛాలెంజ్లో భాగంగా మాజీ రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనే సందేశంతో విత్తన గణపతి ప్రతిమల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కొండపాక మండల హరితసేన కోఆర్డినేటర్లు మహిపాల్ రెడ్డి, దోమల దుర్గాప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అంబటి బాలచందర్ గౌడ్ , బ్రదర్ బిఆర్ఆర్ ఫౌండేషన్ బొంగు రాజేందర్ రెడ్డి , బిఆర్ఎస్ నాయకులు పాండు గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండపాక మండల ఎమ్మార్వో కి, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు నూనె కుమార్ కి, మాజీ ఎంపీపీ సుగుణ దుర్గయ్య కి, హెచ్ కెఆర్ టోల్‌గేట్ మేనేజర్ అశోక్ కి, సిద్దిపేట జిల్లా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెసిడెంట్ టి. న్యూస్ రంగాచారి కి, సిద్దిపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల సాయిరాం కి, మాజీ మంత్రి హరీష్ రావు కార్యాలయ వ్యక్తిగత సహాయకులు ప్రవీణ్ కి, బిఆర్ఎస్ నాయకులు జువ్వల కనకరాజు కి,రంగదాంపల్లి శ్రీనివాస్ కి విత్తన గణపతి ప్రతిమలను అందజేశారు.

## అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు..వ్యవసాయ శాఖ స్వరూపరాణి




మన ప్రజా ప్రతినిధి కొండపాక:మండలం లోని ఎరువుల, విత్తనాల షాపులను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి స్వరూపరాణి శుక్రవారం రోజు ఆకస్మిక తనిఖీ చేశారు. డీఏవో ఆయా షాపుల్లో ఎరువుల నిల్వలు, విత్తనాల విక్రయం, రసీదులు, బిల్లులు తది తర వాటిని క్షుణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయశాఖ అధికారి మాట్లాడుతూ...ఎరువులు ,విత్తనాలు తదితర షా పుల యజమానులు తప్పనిసరిగా రికార్డులు మెయింటెన్ చేయాలని, విత్తనాలు, ఎరువుల నిల్వలు, విక్రయాలను ఎప్పటికప్పుడు షాపు లో ఏర్పాటు చేసిన బోర్డు లో నమోదు చేయాలని సూచించారు. ఈ-పాస్ ద్వారానే ఎరువుల అమ్మకాలు చేయాలని,అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలో డీఏవో మండల వ్యవసాయ శాఖ అధికారి శివరామకృష్ణ , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### కృషికి గుర్తింపు...సేవకు సన్మానం వెల్దుర్తిలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం MEO బుచ్య నాయక్




వెల్దుర్తి మన ప్రజాప్రతినిధి ముకుంద్ సెప్టెంబర్ 11 : వెల్దుర్తి మండల కేంద్రంలో పీఎం శ్రీ వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి వీజూూ బుచ్య నాయక్ ముఖ్య అతిథిగా హాజరై ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి, మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా వీజూూ బుచ్య నాయక్ మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఒక ఉపాధ్యాయుడు మారితే విద్యార్థి మారుతుందని విద్యార్థి మారుతే కుటుంబం మారుతుందని కుటుంబం మారితే సమాజం మారుతుందని సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుడు పాత్ర ఎంతో కీలకమని అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి సేవలు ఉపాధ్యాయులు గుర్తు చేసుకున్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారందరికీ అభినందనలు అని తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న బి సాంబయ్య నీ వీజూూ బుచ్య నాయక్ ఘనంగా సన్మానించారు. జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు నర్తన,శ్రీనివాస్, నవనీత, ఎన్నికయ్యారు. మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు సృజన, శ్రీనివాస్,రాములు, చంద్రం,నరసింహారెడ్డి,రజిత,శ్రవణ్ కుమార్,లావణ్య,భవాని, సురేష్ కుమార్, వెంకటేశం,ఆగమయ్య సంతోష్ కుమార్,సోనీ,ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో వీజూూ బుచ్య నాయక్ రిటైర్డ్ వీజూూ యాదగిరి పీఎం శ్రీ వెల్దుర్తి జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్య వివిధ సంఘాల ఉపాధ్యాయులు పద్మారావు,ప్రణీద్,శ్రీనివాస్, నవీన్ కుమార్, జహీర్,యాదగిరి,మల్లేశం, వెంకటస్వామి,రవీందర్,పోచయ్య, వీరేందర్, పాల్గొని ఉపాధ్యాయులను అభినందించారు. విద్యాభివృద్ధికి ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# వెల్దుర్తి ప్రజల ఆకాంక్ష-వెల్దుర్తి నుండి మెదక్ వరకు డబుల్ రోడ్
## జిల్లా అధ్యక్షుడు వెల్దాస్ మల్లేష్ గౌడ్



నర్సాపూర్ మన ప్రజాప్రతినిధి ముకుంద్ సెప్టెంబర్ 11:వెల్దుర్తి నుండి మెదక్ వరకు డబుల్ రోడ్డు మంజూరు చేయాలని కోరుతూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్ మెదక్ ఎంపీ రఘునందన్ రావు కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వాల్దాస్ మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ.. వెల్దుర్తి నుండి మెదక్ వరకు ఉన్న సింగిల్ రోడ్డు వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నిత్యం ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ రోడ్డు మీద కలెక్టర్ కార్యాలయం మరియు మెదక్ అవసర నిమిత్తం నిత్యం రాకపోకలు ఎక్కువగా ఉండటంతో డబుల్ రోడ్డుగా విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి వెల్దుర్తి – మెదక్ డబుల్ రోడ్డును మంజూరు చేయాలని ఎంపీ రఘునందన్ రావు ని కోరారు. దీనికి ఎంపీ రఘునందన్ రావు సానుకూలంగా స్పందించి తప్పకుండా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి రోడ్డు మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాప గారి రమేష్ గౌడ్ జిల్లా జిఎస్ సంఘసాని సురేష్ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు గౌడ్ మండల అధ్యక్షులు రవి కౌన్సిల్ మెంబర్ కొండలరావు అల్లిపూర్ సర్పంచ్ కుమార్ ఓబిసి జిఎస్టి శ్రీనివాస్ గౌడ్ నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నేటి తరానికి ఆదర్శం



గరిడేపల్లి (మన ప్రజా ప్రతినిధి దినపత్రిక )తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటము నిస్వార్థంగా చేసిన పోరాటం అని,సాయుధ పోరాట చరిత్రను పాఠ్యంశాలలో చేర్చి బావి తరాలకు అందించాల్సిన అవసరం వున్నదని,తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నేటి తరానికి ఆదర్శమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 80 వ వార్షికోత్సవాల సందర్బంగా సిపిఐ గరిడేపల్లి మండల సమితి ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవ సభ మండలంలోని పొనుగోడు గ్రామం లో, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, పొనుగోడు గ్రామ మాజీ సర్పంచ్, తన ఆస్తిలో కుమారుడితో సమానం గా పార్టీ కి ఆస్తిని పంచి ఇచ్చిన మహా మనిషి అనుమాల లింగయ్య స్తూపం వద్ద ఈరోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైజాం నవాబ్ నిరంకుశంత్వానికి వ్యతిరేకంగా, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ నుండి విముక్తి కోసం, 1946 నుండి 1951 వరకు చారిత్రాత్మకమైన పోరాటం కమ్యూనిస్టుల నాయకత్వంలో జరిగిందని ఆయన అన్నారు. 225 సంవత్సరాల పాటు హైదరాబాద్ సంస్థానాన్ని నిజాం నవాబ్ పరిపాలన చేసినారని మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ పాలనలో హైదరాబాద్ సంస్థానం లోని ప్రజలపై వేధింపులు,పన్నుల పై పన్నులు వేసేవారని,మహిళలను చిత్ర హింసలకు గురి చేసినారని ఆయన అన్నారు. నైజాం నవాబ్ అరాచకాలకు వ్యతిరేకంగా ప్రజలు కమ్యూనిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో ఆయుధాలు ధరించి పోరాడినారని ఆయన అన్నారు. ఆనాడు వెట్టిచాకిరీ పేరు తో ప్రజలను దోచుకునే వారని,రైతులు పండించిన పంటలను పన్నుల రూపంలో దోచుకునే వారని, వాటన్నిటికీ వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ ప్రజలను చైతన్యం చేసి పోరాటాలు చేసి ప్రజలను విముక్తి చేసిన ఘనత కమ్యూనిస్టులదని ఆయన అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను హిందూ, ముస్లింల పోరాటంగా బీజేపీ చెప్తుందని అది తప్పని, చరిత్రను వక్రీకరించి బీజేపీ పబ్బంగడుపుకోవాలని చూస్తుందని ఆయన అన్నారు. ఆంధ్ర మహాసభ ఆధ్వర్యంలో ప్రజలు గ్రామాల్లో సంఘం ఏర్పాటు చేసుకుని ప్రజలను చైతన్యం చేస్తూ ముందుకు సాగినారని ఆయన అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ద్వారా 10 లక్షల ఎకరాల భూమి పేదలకు పంచిన ఘనత కమ్యూనిస్టు పార్టీదని ఆయన అన్నారు. 4000 మంది కమ్యూనిస్టులు ఆ పోరాటంలోప్రాణాలు కోల్పోయినారని ఆయన అన్నారు. 3000 వేల గ్రామాల్లో స్వయం పాలన ఏర్పాటు చేసుకున్నారని. వెట్టిచాకిరికి వ్యతిరేకంగా పోరాడి నారని. ఆయన అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం వలన దేశ వ్యాప్తంగా ఉన్న అనేక సంస్థానాలను భారత ప్రభుత్వంలో విలీనం చేసినారని ఆయన అన్నారు. దేశ వ్యాప్తంగా అనేక పోరాటాలకు మార్గదర్శిగా తెలంగాణ రైతంగా సాయుధ పోరాట చరిత్ర వున్నదని ఆయన అన్నారు..తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నేటి తరానికి ఆదర్శమని ఆయన అన్నారు. ఈ సందర్బంగా అమరవీరుల స్థూపాల వద్ద, పార్టీ దిమ్మెల వద్ద ఎర్రజెండా లను ఆవిష్కరించినారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గుండు వెంకటేశ్వర్లు, పోకల వెంకటేశ్వర్లు, సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, ఏ ఐ టియు సి జిల్లా కార్యదర్శి త్రిపురం సుధాకర్ రెడ్డి,రైతు సంఘం రాష్ట్ర సమితి సభ్యులు బిల్లా కనకయ్య,సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు ఎడ్ల అంజిరెడ్డి, వేశాల ఆంజనేయులు,కుందూరు వెంకటరెడ్డి,పోకల ఆంజనేయులు, రంగాపురం గ్రామ సర్పంచ్ కట్టా కళ్యాణి,ప్రతాని సైదులు, చేవ్వా వెంకన్న, సాగి వెంకటేశ్వరావు,కుంభం వెంకటి,రెడపంగు సైదులు,పగడాల శ్రీనివాస్,బాల శౌరి, నవీన్ చారీ,అంబటి వెంకటరెడ్డి, గోవిందరెడ్డి, పంగ గోవిందు ,పంగా సైదులు, ఈశ్వరాచారీ, పంగ సైదయ్య, సోమయ్య, బండారు నాగయ్య, లక్షమయ్య,జక్కంపూడి శ్రీనివాస్,షేక్ నబి సాహెబ్, పీర్ సాహెబ్, దొండపాడు సైదులు,నబి సాహెబ్, ఈద నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో రాహుకాల పూజ



మన ప్రజా ప్రతినిధి కొండపాక మండల్: మర్పడగ గ్రామం లోని శ్రీ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున క్షేత్రంలో శుక్రవారం నాడు రాహుకాల పూజ అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథ శర్మ పర్యవేక్షణలో నవగ్రహ, దిక్పాలక పూజ, అష్టనాగ పూజ నిర్వహించారు. అనంతరం సుబ్రహ్మణ్యస్వామికి విశేష పంచామృత ఫలరస అభిషేకం జరిపించారు. భక్తుల జయధ్వానాల మధ్య పల్లకీసేవ నయనాందకరంగా జరిపించి, అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు

## హక్కుల సాధనకు ఐక్యంగా నిలిచిన ఉద్యోగులు
## బ్యాంక్ సిబ్బంది సమ్మె జయప్రదం




మనప్రజాప్రతినిధి/రాజన్న సిరిసిల్ల సెప్టెంబర్, 11:రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో న్యాయమైన డిమాండ్ల సాధన కోసం బ్యాంక్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె అత్యంత విజయవంతమైంది. సిరిసిల్ల పట్టణ కేంద్రంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో దాదాపు 100 మందికి పైగా బ్యాంక్ ఉద్యోగులు, సిబ్బంది మరియు యూనియన్ నాయకులు పాల్గొని తమ నిరసన గళాన్ని విన్పించారు. ఉద్యోగులు చూపిన సంఘీభావం, ఐక్యత మరియు పట్టుదల హక్కుల పోరాటానికి మరింత బలాన్ని చేకూర్చాయని యూనియన్ నాయకులు తెలిపారు. ఈ సమ్మె ద్వారా ఉద్యోగుల నిరసన స్వరం బ్యాంకింగ్ యాజమాన్యానికి, ప్రభుత్వానికి మరియు ప్రజలకు బలంగా చేరిందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సమ్మెను జయప్రదం చేయడానికి సహకరించిన సహోద్యోగులు, యూనియన్ నాయకులు మరియు ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు హృదయపూర్వక ధన్య వాదాలు తెలిపారు. హక్కుల సాధనలో పాల్గొన్న అందరికీ విప్లవాభివందనాలు తెలియజేస్తూ, ఐక్యతే మన బలం అని పిలుపునిచ్చారు.

# ప్రజల సమస్యలు పట్టించుకోరా..? అధికార, ప్రతిపక్షాలపై బీజేపీ ఫైర్!



దౌల్తాబాద్, సెప్టెంబర్ 11 (మన ప్రజా ప్రతినిధి):ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకుండా అధికార, ప్రతిపక్ష పార్టీలు పరస్పరం విమర్శలు చేసుకోవడానికే పరిమితమవుతున్నాయని బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు కిషన్‌భూపాల్‌రెడ్డి, మండల మాజీ ఉపాధ్యక్షుడు స్వామి విమర్శించారు. రాజకీయ విమర్శలకు ఇచ్చే ప్రాధాన్యతను ప్రజా సమస్యల పరిష్కారానికి ఇవ్వాలని వారు సూచించారు.దౌల్తాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వ్యవసాయం తదితర సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని వారు తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు, గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించి పరిష్కరించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు.సర్పంచులు, ఎంపీటీసీల నుంచి ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి వరకు అందరూ ప్రజల ద్వారా ఎన్నికైన వారేనని, ప్రజలకు జవాబుదారీగా పనిచేయాల్సిన బాధ్యత వారిపై ఉందని పేర్కొన్నారు. ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన నాయకులు ప్రజల సమస్యలను పట్టించుకోకపోతే ప్రజల్లో విశ్వాసం కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు.ఆస్తులపై ప్రజలకు సమాధానం చెప్పాలి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబానికి సంబంధించిన ఆస్తులపై కూడా కిషన్‌భూపాల్‌రెడ్డి, స్వామి పలు ప్రశ్నలు సంధించారు. తెలంగాణ ఉద్యమానికి ముందు ఉన్న ఆస్తులు, అనంతరం పెరిగిన ఆస్తులపై ప్రజలకు స్పష్టమైన వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రస్తుత ప్రభుత్వంలోని ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుల ఆస్తులు, ప్రజాధనం వినియోగం విషయంలోనూ పారదర్శకత ఉండాలని కోరారు. వారు చేసిన ఆరోపణలపై సంబంధిత నేతల వివరణ తెలియాల్సి ఉందన్నారు.వ్యక్తిగత విమర్శలు కాదు.. ప్రజా సమస్యలపై పోరాటం రాజకీయ నాయకులు ఒకరిపై ఒకరు వ్యక్తిగత విమర్శలు, పరస్పర దూషణలకు దిగడం వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదని వారు అన్నారు. అసెంబ్లీ సమావేశాలను రాజకీయ విమర్శలకు కాకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా ఉపయోగించుకోవాలని సూచించారు.ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే నాయకులకే ప్రజల మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు అన్ని రాజకీయ పార్టీల పనితీరును నిశితంగా గమనిస్తున్నారని, ఎన్నికల సమయంలో తమ ఓటుతో తగిన సమాధానం చెప్పే అవకాశం ఉందన్నారు. బీజేపీ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని కిషన్‌భూపాల్‌రెడ్డి, స్వామి స్పష్టం చేశారు.

# సింప్లీ ఫ్రెష్ మహిళల్ని వేధించిన సూపర్వైజర్ ను తొలగించాలి,కేసులు నమోదు చేయాలి

## -పరిశ్రమలో మహిళల భద్రత కమిటీ ఏర్పాటు చేయాలి
## -పరిశ్రమలో కనీస వేతనాలు,చట్టపరమైన సౌకర్యాలు అమలు చేయాలి
## -సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు సందబోయిన ఎల్లయ్య,గోపాలస్వామి



మన ప్రజాప్రతినిధి దినపత్రిక,చేర్యాల, జనగామ నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం.చేర్యాల మండలం, అర్జున్ పట్ల గ్రామ పరిధిలో ఉన్న సింప్లి ఫ్రెష్ పరిశ్రమలో మహిళల్ని వేధింపులు గురిచేసిన సూపర్వైజర్ ను తొలగించాలని,కేసు నమోదు చేయాలని, పరిశ్రమలో మహిళ అంతర్గత భద్రత కమిటీ ఏర్పాటు చేయాలని సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సందబోయిన ఎల్లయ్య కాముని గోపాలస్వామి పరిశ్రమ యజమాన్యాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రోజున పరిశ్రమ సందర్శించి సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పరిశ్రమ యజమాన్యానికి వినతిపత్రం అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమ మండలానికి దూరంగా ఉంటూ పరిశ్రమలో ఆటవిక రాజ్యాన్ని తలపిస్తుందని అన్నారు.పురుష సూపర్వైజర్లు మహిళలపై పరిశ్రమంలో వేధింపులకు పాల్పడడం జరుగుతుందని,పద్దెనమీది ఎకరాల స్థలంలో పరిశ్రమ ఉండటం వల్ల ఒంటరిగా ఉన్న మహిళలను వేధింపుల గురి చేస్తున్నారని,మలవిసర్జనకు వెళ్తామంటే డైపర్లు వేసుకొని రావాలని అసభ్యంగా వివరించడం జరుగుతుందని అన్నారు.2013 చట్టం ప్రకారం మహిళ అంతర్గత కమిటీ ఉండాల్సి ఉన్న కమిటీ లేదని అన్నారు.కాంట్రాక్టు సూపర్వైజర్లు నచ్చినవారిని,ముఖాలు చూసుకుంటూ పని కల్పించడం జరుగుతుందని అక్రమంగా తొలగింపులు జరుగుతున్నాయని అన్నారు.పరిశ్రమలో కార్మికులందరికీ జీవో ఆరు ప్రకారం కనీస వేతనాలు,ఈఎస్ఐ, పిఎఫ్,జాతీయ పండుగ సెలవులు చట్టపరమైన సౌకర్యాలు అమలు జరగడం లేదని అన్నారు.కార్మికుల జీతాల నుండి ఈఎస్ఐపిఎఫ్ కటింగ్ చేసిన స్లిప్పులు,గుర్తింపు కార్డులు,భద్రత,షూ ఇవ్వడం లేదని అన్నారు.యజమాన్యం అడ్మిన్ అర్జున్ మాట్లాడుతూ సూపర్వైజర్ ను తొలగిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని,కార్మికులందరికీ సమస్యలు పరిష్కారం కోసం యజమాన్యంతో చర్చించి పరిష్కరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాళ్ల బండి శశిధర్,ఐద్వా జిల్లా కార్యదర్శి అత్తిని శారద,సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఇప్పకాయల శోభ, తదితరులు పాల్గొన్నారు

# కొత్త క్రిమినల్ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి వుండాలి




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా :పోలీస్ కమిషనర్ కార్యాలయం ఖమ్మంప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది కొత్త క్రిమినల్ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని,చట్టపరమైన నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ ప్రజలకు మెరుగైన పోలీసింగ్ సేవలు అందించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సూచించారు.కొత్త క్రిమినల్ చట్టాలు2023 అమలులోకి వచ్చిన నేపథ్యంలో 500 మంది సిటీ అర్మ్డ్ రిజర్వ్ పోలీస్ అధికారులు, సిబ్బందికి చట్టాలపై సమగ్ర అవగాహన కల్పించేందుకు గత వారం రోజులుగా ఖమ్మం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని (సిటీసి) సిటీ ట్రైనింగ్ సెంటర్ నిర్వహించారు. ఈ శిక్షణలో భారతీయ న్యాయ సంహిత2023 ( బి ఎన్ ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత2023 (బిఎన్ఎస్ ), భారతీయ సాక్ష్య అధినియమం2023 (బి ఎస్ ఏ)లోని ముఖ్యమైన నిబంధనలు, కొత్త చట్టాల ప్రకారం కేసుల నమోదు, దర్యాప్తు విధానం, సాక్ష్యాల సేకరణ, డిజిటల్ మరియు ఎలక్ట్రానిక్ సాక్ష్యాల ప్రాధాన్యత, బాధితుల హక్కులు, అరెస్టురిమాండ్ ప్రక్రియ, కోర్టు విచారణ తదితర అంశాలపై నిపుణులు అవగాహన కల్పించారు. కొత్త చట్టాల ప్రకారం కేసుల దర్యాప్తును మరింత శాస్త్రీయంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించే విధానాలపై అధికారులకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వండం జరిగింది.ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా కొత్త చట్టాల అమలులో ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేసుకోవడంతో పాటు, దర్యాప్తు నాణ్యతను మరింత మెరుగుపరచడమే ప్రధాన లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.కార్యక్రమంలో సిటీసి ఏసీపీ హరినాద్ బాబు, ఆర్ ఐ నాగుల్ మీరా పాల్గొన్నారు.

# పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి సత్వర పరిష్కారం చూపాలి




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక కొత్తగూడెం జిల్లా:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ కార్యాలయం అక్రమ ఇసుక, పశు రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలి పెట్రోలింగ్, బ్లూ కోట్స్ వాహనాలతో నిరంతరం సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలి అన్నపురెడ్డిపల్లి పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్‌వార్షిక తనిఖీలలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ అన్నపురెడ్డిపల్లి పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం నాడు సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బంది ఎస్పీకి ఘన స్వాగతం పలికారు. అనంతరం విధుల్లో ఉన్న సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించి, పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపే విధంగా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. వివిధ వర్టికల్స్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి సత్వర పరిష్కారం చూపాలని ఆదేశించారు. గ్రేవ్, ప్రాపర్టీ, దొంగతనం కేసులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ నిందితులను త్వరగా గుర్తించి అరెస్ట్ చేయడంతో పాటు చోరీకి గురైన ఆస్తిని రికవరీ చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు.నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.అదేవిధంగా అక్రమ పశు రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. కేసుల దర్యాప్తులో భాగంగా గత నేర చరిత్ర కలిగిన వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణా, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని, యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా గ్రామాలు, విద్యాసంస్థల్లో విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పెట్రోలింగ్ వాహనాలు, బ్లూ కోట్స్ వాహనాల్లో నిరంతరం సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని తక్షణమే స్పందించాలని సూచించారు.పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రికార్డులను పరిశీలించిన అనంతరం పోలీసింగ్ వెబ్ అప్లికేషన్లపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీసీటీఎన్ఎస్ 2.0లో కేసుల వివరాలను సక్రమంగా నమోదు చేయడంతో పాటు సీఐఆర్ పోర్టల్, ఈ సాక్ష్య, నాట్ గ్రిడ్, గాండీవ వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం ద్వారా నేరాల దర్యాప్తులో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని తెలిపారు. సైబర్ మోసాల పట్ల ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.అనంతరం పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ వారి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఐ శ్రీలక్ష్మి, స్టేషన్ హౌస్ ఆఫీసర్ విజయసింహారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో నేర సమీక్షా సమావేశం




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక వరంగల్ జిల్లా:వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోదైన నేరాలు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, నిందితుల అరెస్టులు, సాక్ష్యాధారాల సేకరణ, కోర్టు కేసుల పురోగతిపై గురువారం కమిషనరేట్ కార్యాలయంలో డీసీపీలు, ఏసీపీలు, ఇతర పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, పరారీలో ఉన్న నిందితులను ప్రత్యేక బృందాలు, సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో అరెస్టు చేయాలని అధికారులను ఆదేశించారు. కేసుల దర్యాప్తులో భౌతిక, సాంకేతిక, ఫోరెన్సిక్ ఆధారాలను శాస్త్రీయ పద్ధతిలో సేకరించి, నాణ్యతతో పాటు వేగవంతంగా దర్యాప్తు పూర్తి చేయాలని సూచించారు.మహిళలు, చిన్నారులపై నేరాలు, ఆస్తి నేరాలు, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలు, తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.త్వరలో ప్రారంభం కానున్న గణేష్ నవరాత్రుల సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, గణేష్ మండపాల నిర్వాహకులతో సమన్వయం చేసుకుంటూ ముమ్మర పెట్రోలింగ్ నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా మాదకద్రవ్యాల నియంత్రణలో ప్రతిభ కనబరిచిన డ్రగ్ కంట్రోల్ అధికారులు, సిబ్బందిని అభినందించి రివార్డులు అందజేశారు.సమావేశంలో ఎన్ శ్వేత ఐపీఎస్ వరంగల్ పోలీస్ కమిషనర్ డీసీపీలు అంకిత్ కుమార్, దారా కవిత, రాజమహేంద్ర నాయక్, కిషన్ సింగ్, అదనపు డీసీపీలు ప్రభాకర్ రావు, బాలస్వామి, సురేష్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మానవతాదృక్పథం చాటిన సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక సూర్యాపేట జిల్లా: సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంఎంబీబీఎస్ సీట్ సాధించిన విద్యార్థినికి ఆర్థిక సహాయం అందించిన ఎస్పీ నరసింహ ఐపీఎస్ ప్రభుత్వ గురుకులంలో చదివి గాంధీ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ సీటు సాధించిన పెనపహడ్ మండలానికి చెందిన మామిడి ఇందుకు రూ.20 వేల ఆర్థిక సహాయం.సూర్యాపేట జిల్లా: విద్యతోనే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని, ఇందును నిరూపిస్తూ మెడికల్ సీట్ సాధించడం అభినందనీయం అని ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూనే ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి వరకు, ఇంటర్ ప్రభుత్వ గురుకుల కళాశాలలో చదివి అంగవైకల్యాన్ని అధిగమించి కష్టపడి చదివి పెన్‌పహాడ్ మండలం అనంతారం గ్రామానికి చెందిన మామిడి అంజయ్య, ప్రసన్న దంపతుల కుమార్తె విద్యార్థిని మామిడి ఇందు నీట్ లో మంచి ర్యాంక్ సాధించి గాంధీ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ సీటు సాధించారు. ఇందు తండ్రి అంజయ్య దివ్యాంగుడు కాగా, ప్రభుత్వ పాఠశాలలో తాత్కాలిక స్కావెంజర్‌గా పనిచేస్తున్నారు. తల్లి ప్రసన్న దినసరి కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆర్థికంగా పేద కుటుంబానికి చెందినప్పటికీ, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఇందు తన చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టి ముందుకు సాగింది అని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి వరకు విద్యను అభ్యసించిన ఇందు, హైదరాబాద్‌లోని గౌడిగూడలో ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేసింది. ఇందు చదువుకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్న విషయంపై సోషల్ మీడియాలో సమాచారం వెలువడగా, సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ స్పందించారు. ఇందు విద్యాభ్యాసానికి తన వంతు సహాయంగా రూ.20,000/- ఆర్థిక సహాయాన్ని తన కార్యాలయంలో ఇందుకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ ఐపీఎస్ మాట్లాడుతూ, నిరుపేద కుటుంబానికి చెందినప్పటికీ ఎన్నో కష్టాలను అధిగమించి పట్టుదలతో చదివి నీట్ లో మంచి ర్యాంక్ సాధించి ఎంబీబీఎస్ సీటు పొందడం ఎంతో అభినందనీయమని తెలిపారు. ఇందు తండ్రి దివ్యాంగుడైనప్పటికీ, తన కుమార్తెను కష్టపడి చదివించి ఈ స్థాయికి తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇందు తన చదువును విజయవంతంగా పూర్తి చేసి మంచి వైద్యురాలిగా ఎదిగి, ముఖ్యంగా పేదలు మరియు ఆర్థికంగా వెనుకబడిన వారికి సేవలందించాలని ఎస్పీ ఆకాంక్షించారు. కష్టపడి చదివే విద్యార్థులకు సమాజం అండగా నిలవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇందు విద్యాభ్యాసానికి సంబంధించి భవిష్యత్తులో ఏదైనా సహాయం లేదా సమస్య ఎదురైతే తనను సంప్రదించవచ్చని, ఎల్లప్పుడూ తన వంతు సహాయ సహకారాలు అందించేందుకు అండగా ఉంటానని ఎస్పీ నరసింహ ఐపీఎస్ భరోసా ఇచ్చారు. “పేదరికం లక్ష్యానికి అడ్డంకి కాదు... పట్టుదల, కష్టపడి చదివే తపన ఉంటే ఏదైనా సాధించవచ్చు” అని ఇందు నిరూపించారు అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, పోలీస్ వెల్ఫేర్ ఆర్ఎస్సై సాయిరాం పాల్గొన్నారు.

# తపాస్ పల్లి రిజర్వాయర్ ని పరిశీలించిన కలెక్టర్ కే.హైమావతి



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,కొమురవెల్లి, జనగామ నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం. కొమురవెల్లి మండలంలోని తపాస్ పల్లి రిజర్వాయర్ ను జిల్లా కలెక్టర్ కె.హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.రిజర్వాయర్ పూర్తిస్థాయి సామర్థ్యం 0.3 టీఎంసీలు గాను గోదావరి నదిలో దేవాదుల వద్ద ప్రవహిస్తున్న తీరును బట్టి 0.2 టీఎంసీల నీరు రిజర్వాయర్ లో పంపుచేసి నిల్వ చేశామని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రస్తుతానికి కూడి ఎడమ కాలువలోకి పంపిణీ చేయలేదని నీటిపారుదల శాఖ అధికారులు కలెక్టర్ వివరించారు.ఎల్ నీనో ప్రభావం వల్ల వర్ష భావ పరిస్థితుల కారణంగా రిజర్వాయర్లలో నీటిని తాగటానికి మాత్రమే వినియోగిస్తామని, వ్యవసాయానికి రిలీస్ చేయట్లేదని రిజర్వాయర్ పైన పరివాహక ప్రాంత రైతులకు జిల్లా కలెక్టర్ సూచించారు.అనంతరం తాపస్ పల్లి రిజర్వాయర్ యొక్క కుడి ఎడమ కాలువలను ఆయా గ్రామాల్లో పరిశీలించారు. కొమురవెల్లి మండలంలోని గౌరయపల్లి గ్రామం గుండా వెళ్ళే కాలువను మరియు చేర్యాల మండలం కమలాయపల్లి వద్ద కాలువలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.కలెక్టర్ వెంట నీటిపారుదల శాఖ ఎస్ ఈ,ఈఈ, డిఈ లు తదితరులు ఉన్నారు.

## విఓఏ ల పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలి
## సిఐటియు జిల్లా గౌరవాధ్యక్షులు చినపాక లక్ష్మీనారాయణ డిమాండ్




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక సెప్టెంబర్ 10, గుర్రంపోడు: గుర్రంపోడు మండలంలో విఓఏ (గ్రామ సంఘ సహాయకులు)లకు బకాయి పడిన వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ ఐకెపి వివోఏ ఉద్యోగుల సంఘం (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు చినపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల మహిళా సమైక్య కార్యాలయం ముందు బకాయి వేతనాల కోసం విఓఏలు చేపట్టిన మెరుపు సమ్మెలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో ఎం.ఎస్ మీటింగ్‌కు రాలేదనే నెపంతో పది మందికి మూడు నెలల వేతనాలను ఏపీఎం నిర్లక్ష్యంతో ఆపేశారని మండిపడ్డారు. సీసీల నిర్లక్ష్యం వల్ల మరికొన్ని క్లస్టర్లలో గ్రేడింగ్ నమోదు చేయకపోవడంతో మొత్తం 78 మంది విఓఏలకు సంబంధించిన రూ. 3 లక్షల 90 వేల వేతనాలు నిలిచిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం రూ. 5 వేల స్వల్ప వేతనంతో ఎన్నో కష్టాలకు ఓర్చి పనిచేస్తున్న వి.ఓ.ఏల జీతాలను అధికారులు రకరకాల కారణాలతో ఆపితే వారు ఎలా బతకాలని ప్రశ్నించారు. ఏపీఎం, సీసీల నిర్లక్ష్యం వల్ల విఓఏలకు జీతాలు రావడం లేదని, వీరిని వెంటనే ఈ మండలం నుంచి బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై సీసీలు, ఏపీఎంలతో పాటు పీడీకి వినతిపత్రం ఇచ్చి నెల రోజులు గడిచినా ఇప్పటివరకు సరైన స్పందన లేదని, గత్యంతరం లేకే విఓఏలు సమ్మెకు దిగారని లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు. ఇప్పటికైనా పీడీ చొరవ తీసుకుని వేతనాలు వెంటనే చెల్లించేలా చర్యలు చేపట్టాలని, లేకపోతే మండల వ్యాప్తంగా 'పెన్ డౌన్' కార్యక్రమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర సిఐటియు కార్యవర్గ సభ్యులు పగిడిమర్రి సర్వయ్య, యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు సల్వాది సైదమ్మ, ఆదిరాల లక్ష్మి, నాయకులు వడ్లమల్ల యాదయ్య, బొంగరాల రుద్రమ్మ, రజిత, కవిత, యాదమ్మ, నాగమణి, మంజుల, పుష్ప, ప్రశాంతి, రేణు శ్రీ, సునీత, వెంకటమ్మ, విమల తదితరులు పాల్గొన్నారు.

# రైఫిల్ షూటింగ్ లో ప్రతిభ



భీమవరం సెప్టెంబర్ 11 . మన ప్రజా ప్రతినిధి:భీమవరం జాతీయస్థాయి రైఫిల్ షూటింగ్ లో కాంస్య పతాకాన్ని సాధించడం మన జిల్లాకే గర్వకారణమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఆగష్టు 31 నుంచి సెప్టెంబర్ 8 వరకు కేరళ రాష్ట్రం త్రివేండ్రంలో జరిగిన 17వ సౌత్ జోన్ రైఫిల్ షూటింగ్ ఛాంపియన్ షిప్ లో భీమవరం ఛాంపియన్ స్పోర్ట్స్ అకాడమీ అధినేత సయ్యద్ సుభానీ కాంస్య పతాకాన్ని సాధించిన సందర్బంగా శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అంజిబాబు వారిని అభినందించి సత్కరించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ డిసెంబర్ లో జరిగే నేషనల్ రైఫిల్ షూటింగ్ లో గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్రానికి భీమవరానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 50 మీటర్ల రైఫిల్ షూటింగ్ విభాగంలో విశేష ప్రతిభ కనబర్చి సుభానీ కాంస్య పతాకాన్ని సాధించి డిసెంబర్ లో జరిగే నేషనల్ రైఫిల్ షూటింగ్ ఛాంపియన్ షిప్ కు సుభానీ అర్హత సాధించారని అన్నారు. అనంతరం సుభానీ ని అభినందించి సత్కరించారు. కారుమూరి సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

# ఎంఆర్పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా భూమిగారి రాజేందర్




మన ప్రజాప్రతినిధి దినపత్రిక,చేర్యాల, జనగామ నియోజకవర్గం :జనగామ నియోజకవర్గం. సిద్దిపేట జిల్లా,చేర్యాల మండల కేంద్రానికి చెందిన భూమిగారి రాజేందర్ ను జాతీయ కమిటీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది. ఇటీవల హైదరాబాద్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన జాతీయ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ నిర్మాణం చేయడం జరిగింది ఇందులో భాగంగా భూమిగారి రాజేందర్ ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకొని ఆమోద పత్రం అందించిన జాతీయ అధ్యక్షులు మేడి పాపన్న రాష్ట్ర అధ్యక్షులు కేదాసి మోహన్ భూమిగారి రాజేందర్ మాట్లాడుతూ నా పై నమ్మకంతో ఇంతటి బాధ్యతను ఇచ్చిన జాతీయ అధ్యక్షులు మేడి పాపన్న రాష్ట్ర అధ్యక్షులు కేదాసి మోహన్ కు రాష్ట్ర కమిటీ మరియు జిల్లా కమిటీ మండలాల కమిటీ నాయకులు అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తూ ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ ను బలోపేతం చేస్తూ దళిత జాతి అభివృద్ధి కోసం నిరంతరం పాటు పడతానని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాశపాక రాజేందర్ మరియు గంట సుదర్శన్,మేడ స్వామి,సిద్ధిని రాజ మల్లయ్య,బొంబాయి వెంకన్న జిల్లా అధ్యక్షులు దేవులపల్లి రాజేందర్,జిల్లా ఇన్చార్జి లింగాల కృష్ణ, బాలిగారి కృష్ణ,ముస్త్యాల నవీన్,గడ్డం వెంకటేష్,లింగాల మహేష్,లింగాల నర్సింలు,తదితరులు పాల్గొన్నారు

# 100 శాతం స్ట్రైక్ రేట్ జనసేన లక్ష్యం





భీమవరం సెప్టెంబర్ 10 మనప్రజాప్రతినిధి : భీమవరం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి పార్టీలు సమన్వయంతో ముందుకెళ్లి 100 శాతం స్ట్రైక్ రేట్ తో గెలుపొందాలని, ఎక్కువ స్థానాల్లో పోటీ చేయడం కంటే బలం ఉన్న ప్రతి చోటా సరైన అభ్యర్థులను బరిలోకి దింపి విజయం సాధించడమే ప్రధాన ఉద్దేశమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వీర మహిళలతో స్థానిక సంస్థల ఎన్నికలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో కీలక పాత్ర పోషించిన జనసేన పార్టీ 2024 ఎన్నికల ఫలితాల మాదిరిగానే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ 100 స్ట్రైక్ రేట్ తో విజయం సాధించాలన్నారు. కూటమి భాగస్వామ్య పక్షాలతో సమన్వయం పాటిస్తూనే జనసేనకు పట్టున్న ప్రాంతాల్లో సత్తా చాటాలన్నారు. స్థానిక ఎన్నికల్లో వ్యూహాలు భిన్నంగా ఉంటాయని, అభ్యర్థుల ఎంపిక దశ నుంచే పార్టీ నిర్దేశించే నియమాల ప్రకారం ముందుకు వెళ్లాలని ఎమ్మెల్యే అంజిబాబు సూచించారు. 1వ వార్డు నుంచి 39వ వార్డులలో మన బలాబలాలు గుర్తించాలని, 100 శాతం స్ట్రైకింగ్ రేట్ తో విజయమే లక్ష్యంగా పని చేద్దామని పిలుపునిచ్చారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ వేగేశ్న కనకరాజు సూరి, జిల్లా డిసిఎంఎస్ చైర్మన్ చాగంటి మురళి కృష్ణ, ఏపిఐఐసి డైరెక్టర్ చెనమల్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలాన్ని చాటేందుకు సమన్వయంతో పని చేయాలని, త్వరలో మరిన్ని సమావేశాలు నిర్వహించి ఎన్నికలకు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు సముచిత స్థానం ప్రాధాన్యత ఖచ్చితంగా అందిస్తామన్నారు. కూటమి అభ్యర్థులకు ఢోకానే లేదని వారు విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వీర మహిళలు పాల్గొన్నారు.

# వితన చట్టంపై రైతు సంఘాలతో చర్చలు

- ప్రతిపాదిత సీడ్ యాక్ట్‌పై దేశవ్యాప్త సంప్రదింపులు
- అన్ని రాష్ట్రాల రైతు ప్రతినిధుల సూచనలు
- రైతులతో చర్చల ద్వారానే విధానాలు: శివరాజ్ సింగ్ చౌహాన్
- రైతుల అభిప్రాయాలను పరిశీలిస్తామన్న కేంద్ర మంత్రి



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11 (మనప్రజాప్రతినిధి) వ్యవసాయం, రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి శాఖ కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రతిపాదిత బలమైన విత్తన చట్టం (సీడ్ యాక్ట్)పై దేశవ్యాప్తంగా రైతు సంఘాల నాయకులతో విస్తృత స్థాయి చర్చలు నిర్వహించారు. విత్తనాల నాణ్యత, రైతుల హక్కుల పరిరక్షణ, వ్యవసాయ ఉత్పాదకత పెంపు లక్ష్యంగా రూపొందిస్తున్న ఈ చట్టంపై రైతుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు ఈ సంప్రదింపులు చేపట్టారు. ఈ సమావేశంలో దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాలకు చెందిన రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. తమ అనుభవాలు, విత్తనాల సరఫరాలో ఎదురవుతున్న సమస్యలు, చట్టంలో ఉండాల్సిన అంశాలపై వారు తమ అభిప్రాయాలను వెల్లడించారు. రైతుల నుంచి వచ్చిన సూచనలను కేంద్ర ప్రభుత్వం నమోదు చేసుకుని పరిశీలనకు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ రైతులతో సంప్రదింపులు జరపకుండా ఎలాంటి వ్యవసాయ విధానాలను ప్రభుత్వం రూపొందించదని స్పష్టం చేశారు. రైతుల భాగస్వామ్యంతోనే వ్యవసాయ రంగానికి సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొన్నారు. సంభాషణ, సంప్రదింపుల ద్వారానే ప్రతి వ్యవసాయ విధానాన్ని రూపొందించాలనే ప్రభుత్వ సంకల్పాన్ని ఆయన వెల్లడించారు. ప్రతిపాదిత చట్టం ద్వారా నాణ్యమైన విత్తనాలు రైతులకు అందుబాటులోకి రావడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత మెరుగుపడుతుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని చట్టాన్ని మరింత సమర్థవంతంగా రూపొందించేందుకు విస్తృత స్థాయిలో అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు మంత్రి తెలిపారు. సమావేశంలో పాల్గొన్న రైతు సంఘాల నాయకులు పలు సూచనలు, అభ్యర్థనలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. విత్తనాల నాణ్యత నియంత్రణ, నకిలీ విత్తనాల నియంత్రణ, రైతుల నష్టాలకు పరిహారం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. రైతుల అవసరాలను ప్రతిబింబించేలా చట్టం ఉండాలని అభిప్రాయపడ్డారు. రైతు సంఘాల నాయకులు అందించిన సూచనలు, అనుభవాలకు కేంద్ర



మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో వచ్చిన ప్రతి అభిప్రాయాన్ని సీరియస్‌గా పరిశీలించి తగిన అంశాలను చట్ట రూపకల్పనలో పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని శివరాజ్ సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు.

# రైల్వే ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం

- రూ.10,021 కోట్లతో ఐదు మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులు
- 540 కిలోమీటర్ల మేర రైలు మార్గాల సామర్థ్య పెంపు
- దక్షిణాది రాష్ట్రాలకు మెరుగైన రైలు కనెక్టివిటీ
- ప్రాజెక్టులను స్వాగతించిన సోము వీర్రాజు



అమరావతి, సెప్టెంబర్ 11 (మనప్రజాప్రతినిధి) ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధి కొత్త శిఖరాలను చేరుకుంటోందని బీజేపీ నాయకుడు సోము వీర్రాజు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.10,021 కోట్ల వ్యయంతో ఐదు కీలక రైల్వే మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు ఆమోదం తెలపడం శుభపరిణామమని అన్నారు. ఈ ప్రాజెక్టులు దేశ ఆర్థికాభివృద్ధికి, రవాణా రంగ పురోగతికి దోహదపడతాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన ప్రాజెక్టుల ద్వారా 540 కిలోమీటర్ల మేర రైల్వే మార్గాల సామర్థ్యం పెరుగుతుందని సోము వీర్రాజు పేర్కొన్నారు. అరక్కోణంరేణిగుంట, వైట్‌ఫీల్డ్‌బంగారుపేట, హోసూరుఓమల్లూరు, సేలంకరూరుదిండిగల్, సికింద్రాబాద్‌కాజీపేట మార్గాల్లో మల్టీట్రాకింగ్, డబ్లింగ్ పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ఈ పనులతో రైళ్ల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టుల వల్ల ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు దక్షిణ భారత రాష్ట్రాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. మొత్తం 17 జిల్లాలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరనుండగా, 2,121 గ్రామాలకు మెరుగైన రైలు కనెక్టివిటీ లభించనుందని తెలిపారు. ప్రాంతీయ అభివృద్ధికి కూడా ఈ ప్రాజెక్టులు దోహదపడతాయని అన్నారు. దాదాపు 52 లక్షల మందికి ఉన్నత స్థాయి రైలు సేవలు అందుబాటులోకి రావడంతో పాటు సరకు రవాణా సామర్థ్యం కూడా గణనీయంగా పెరుగుతుందని సోము వీర్రాజు పేర్కొన్నారు. అదనంగా 47 మిలియన్ టన్నుల వార్షిక సరకు రవాణా సామర్థ్యం ఏర్పడుతుందని చెప్పారు. దీనివల్ల పరిశ్రమలు, వాణిజ్య రంగాలకు ఊతం లభిస్తుందని అభిప్రాయపడ్డారు.రైల్వే వ్యవస్థ ఆధునీకరణతో